https://epaper.dksaardyamlochaatimpu.com

E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

డీకే సార్థ్యంలో చాటింపు
తెలంగాణ దిన పత్రిక




హైదరాబాద్ సంపుటి : 17 సంచిక : 290 ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ బుధవారం, ఆగస్టు,19, 2026 పేజీలు : 8 వెల : రూ.1/-

## పెట్టుబడిదారులకు
# స్వర్గధామం తెలంగాణ..
### క్లీన్ ఎనర్జీ మ్యానుఫాక్చరింగ్ హబ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతాం.!: భట్టి

**హైదరాబాద్,ఆగస్టు 18:**తెలంగాణ రాష్ట్రం అన్ని రకాల పెట్టుబడిదారులను ప్రోత్సహించే స్వర్గధామమని, క్లీన్ ఎనర్జీ రంగానికి నిలయంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్‌లోని హైటెక్స్, నోవాటెల్ లో 2 రోజుల పాటు జరగనున్న 'ఇండియా ఎనర్జీ సమ్మిట్ ఒ ఎక్స్ పో 2026'ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సమ్మిట్ కు విచ్చేసిన పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు మరియు సాంకేతిక నిపుణులను ఉద్దేశించి డిప్యూటీ సీఎం ప్రసంగించారు."పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు, శాస్త్రవేత్తలు, సీఈఓలు.. మీ అందరినీ ఆహ్వానిస్తున్నాను, రండి. తెలంగాణ అన్ని రకాల పెట్టుబడిదారులను ప్రోత్సహించే రాష్ట్రం, ఇది పెట్టుబడిదారులకు ఒక స్వర్గధామం. మన సమృద్ధిని పంచుకోవడానికి మరియు కలిసి ఎదగడానికి మిమ్మల్ని పూర్ణహృదయంతో ఆహ్వానించడానికి ఈ రాష్ట్రం సిద్ధంగా ఉంది" అని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఇంధన రంగంలో మార్పు అనేది కేవలం విద్యుత్ ఉత్పత్తి మూలాన్ని మార్చడం మాత్రమే కాదని, అది సమగ్ర ఆర్థిక వ్యవస్థ నిర్మాణాన్నే మార్చే విప్లవాత్మక



ప్రక్రియ అని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణను కేవలం స్వచ్ఛమైన ఇంధనాన్ని వినియోగించే రాష్ట్రంగా మాత్రమే కాకుండా, ప్రపంచ క్లీన్ ఎనర్జీ రంగానికి అవసరమైన సాంకేతికతలను తయారు చేసే ప్రధాన కేంద్రంగా నిలపాలని ఆకాంక్షించారు.

## జహీరాబాద్ స్మార్ట్ సిటీతో 2 లక్షల మందికి ఉపాధి..
# రూ. 15 వేల కోట్ల పెట్టుబడులే లక్ష్యం
### - నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న శ్రీధర్ బాబు-కాన్ఫరెన్స్ ను నిర్వహించిన నిర్మలా సీతారామన్, పీయూష్ గోయెల్- స్మార్ట్ సిటీ పనులను 2028 నాటికి పూర్తి చేస్తామన్న మంత్రి శ్రీధర్ బాబు

**న్యూఢిల్లీ,ఆగస్టు 18:**తెలంగాణ పారిశ్రామిక రంగానికి జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ఒక కొత్త ఊపునివ్వనుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఈ స్మార్ట్ సిటీ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 2 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. 3,245 ఎకరాల భారీ విస్తీర్ణంలో అభివృద్ధి చేస్తున్న ఈ స్మార్ట్ సిటీ ద్వారా సుమారు రూ. 15 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య-పరిశ్రమల మంత్రి పీయూష్ గోయెల్‌లు సంయుక్తంగా నిర్వహించిన 'నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్' వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి శ్రీధర్‌బాబు సచివాలయం నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జహీరాబాద్ స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులన్నింటినీ 2028 మార్చి నాటికి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈపీసీ (ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్) విధానంలో జరుగుతున్న ఈ పనులను గడువులోగా పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించామని వివరించారు. ఈ స్మార్ట్ సిటీలో భూమి రూపంలో తెలంగాణ ప్రభుత్వ వాటా 51 శాతం ఉండగా, మౌలిక



వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూరుస్తోందని మంత్రి పేర్కొన్నారు. పరిశ్రమలకు అవసరమైన ప్లగ్ అండ్ ప్లే సదుపాయాలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఇదే క్రమంలో, 'భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన' (భవ్య) కింద కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రకటించిన 100 ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కుల్లో నాలుగింటిని తెలంగాణకు కేటాయించాలని కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్‌ను ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు కోరారు.

## మేము అధికారంలోకి వస్తే
# కుటుంబానికి ఎకరం భూమి..
### సంచలన పథకం ప్రకటించిన కవిత

రాష్ట్రంలో తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే 'భూ లక్ష్మి పథకం' కింద భూమి లేని పేదలకు ఎకరం చొప్పున ఇస్తామని కవిత సంచలన ప్రకటన చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి భూమి అంటే కేవలం లావాదేవీలే కావొచ్చు కానీ పేద బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు భూమీ, అడవి అంటే పంచప్రాణాలు అని రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు జరిగినా ముందుగా తీసుకుంటున్నవి అసైండ్ భూములేనని మండిపడ్డారు. రాష్ట్రంలో భూమి పంపిణీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇవాళ బంజారాహిల్స్ లోని టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కవిత.. రేవంత్ రెడ్డి తమ్ముళ్లు భూ దొంగలు అని అనగనగా ఒక రాజు ఏడుగురు కొడుకులు అన్నట్లుగా రేవంత్ రెడ్డి సోదరుల బూదోపిడీ సాగుతోందని, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి రాక్షస పాలన సాగుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క కుటుంబ సభ్యుల పాలన సాగుతోందని ఇంత మంది రాజ్యాంగేతర శక్తుల దోపిడీ ఏంటని ప్రశ్నించారు. 30 వేల అసైండ్ భూములను ఈ ప్రభుత్వం లాగేసుకుందని ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉండే మేనిఫెస్టోలో చెప్పినట్లుగా పేదల అసెండ్ భూములపై వారికి యాజమాన్య హక్కులు కల్పించాలని చాలెంజ్ చేశారు.ప్రొఫెసర్ జయంతి




సందర్భంగా తెలంగాణలో సామాజిక న్యాయం సాధించాలనే సంకల్పం తీసుకోగానే గత 31 నెలల్లో ఏనాడూ సామాజిక న్యాయం పదం ఉచ్చరించని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సామాజిక న్యాయం గురించి మాట్లాడుతున్నారన్నారు. సామాజిక అన్యాయం అనబోయి సామాజిక న్యాయం అన్నారని రాష్ట్ర ప్రజలు రేవంత్ రెడ్డి మాటలను నమ్మవద్దన్నారు. రేవంత్ రెడ్డి కేబినెట్ లోనే సామాజిక న్యాయం లేదని, పదవులు ఇచ్చే అవకాశం ఉండి కూడా ఎస్సీ ఎస్టీ, బీసీలు ఎందుకు న్యాయం చేయడం లేదన్నారు. రేవంత్ రెడ్డి మేకవన్నెపులిలాంటి వాడని విమర్శించారు.

# మహాత్మా గాంధీపై కూడా కేసు పెట్టండి
### ఖర్గే కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,ఆగస్టు 18:**ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో 'వందేమాతరం' గేయాలాపనకు అంతరాయం కలిగించేందుకు యత్నించారంటూ సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై దాఖలైన పోలీసు ఫిర్యాదుపై కాంగ్రెస్ అధిష్టానం స్పందించింది. ఈ వివాదంపై స్పందించిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బీజేపీని తీవ్రంగా విమర్శించారు. "ఒకవేళ వందేమాతరం అంశంపై కేసులు నమోదు చేయాలనుకుంటే ముందుగా మహాత్మా గాంధీపై కూడా కేసు నమోదు చేయాలి" అని ఆయన వ్యాఖ్యానించారు. ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వందేమాతరం గేయం ఆలాపిస్తున్న సమయంలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఖర్గేల మధ్య సంభాషణలు, సైగలు జరిగాయని, ఇది జాతీయ గేయాన్ని అసమానించడమేనంటూ బీజేపీ నేతలు విమర్శలు గుప్పించారు. అనంతరం ఈ విఘాతంపై సోనియా, రాహుల్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కాంగ్రెస్



అధ్యక్షుడు ఖర్గే స్పందిస్తూ.. 1937లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ వందేమాతరంలోని మొదటి రెండు చరణాలను మాత్రమే జాతీయ గేయంగా స్వీకరించాలని నిర్ణయించిందని, ఆ కమిటీ సమావేశానికి మహాత్మా గాంధీ కూడా అధ్యక్షత వహించారని గుర్తుచేశారు.

# ఒకరిని మించి మరొకరు..
### కేసీఆర్, రేవంత్ రెడ్డిలపై ఈటల సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్,ఆగస్టు 18:**గత బీఆర్ఎస్ పాలనలో జరిగిన భూ అక్రమాల కంటే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భూ దోపిడీ రెండు రెట్లు పెరిగిందని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్, రేవంత్ రెడ్డి ప్రభుత్వాల తీరుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం ప్రజలకు కేటాయించిన భూములు, పరిశ్రమల కోసం ఇచ్చిన స్థలాలు, చివరికి ప్రభుత్వమే లేఅవుట్లు వేసి విక్రయించిన భూములను కూడా '22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం దారుణమని ఈటల మండిపడ్డారు. దశాబ్దాలుగా రైతులు సాగు చేసుకుంటున్న భూములను లాక్కోవడం వెనుక భూమాఫియాకు కట్టబెట్టాలనే కుట్ర ఉందని, "ధరణి పోర్టల్ రద్దు చేసినా, భూములను లాక్కునే ప్రభుత్వాల ధోరణిలో ఏ మార్పు రాలేదు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం భూ దందాలకు పాల్పడితే, ఇప్పుడు రేవంత్ రెడ్డి సర్కార్ ఆ భూములను 'సైటిల్ మెంట్' చేసుకుంటోంది" అని ఈటల విమర్శించారు. గతంలో జరిగిన హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఖర్చు చేసిన డబ్బులు ఇలాంటి భూ దందాల



ద్వారా వచ్చినవేనని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. గల్ఫ్ ఆయిల్ కంపెనీకి చెందిన భూము లు ఫీనిక్స్ కంపెనీ మీదుగా ఎలా చేతులు మారాయో అందరికీ తెలుసని, ఈ అక్రమాల్లో పెద్దల హస్తం ఉందని ఎంపీ పేర్కొన్నారు. పేదలకు, రైతులకు అన్యాయం చేస్తూ రియల్ ఎస్టేట్ మాఫియాలకు కొమ్ము కాయడం మానుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ అరాచకాలను అడ్డుకునే వరకు బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

# ఒడిశాలో వరదల బీభత్సం.. 13 మంది మృతి

భువనేశ్వర్: ఒడిశాలో వరదల బీభత్సం సృష్టిస్తున్నాయి. వరదల కారణంగా తాజాగా మరో ఐదుగురు మృతి చెందారు. దీంతో ఇప్పటి వరకూ వరదల కారణంగా మృతిచెందిన వారి సంఖ్య 13కు చేరింది. భారీ వర్షాలు, ఉప్పొంగుతున్న వరద నీటితో రాష్ట్రంలోని బాలాసోర్, భద్రక్, జాజ్‌పూర్, కియోంఝర్, మయూర్‌భంజ్, కేంద్రాపడా జిల్లాల్లో జనజీవనం పూర్తిగా దెబ్బతింది. రాష్ట్ర ప్రత్యేక సహాయ కమిషనర్ (ఎస్ఆర్‌సీ) కార్యాలయం తాజా నివేదిక ప్రకారం.. ఈ ఆరు జిల్లాల్లోని 1,300 గ్రామాలకు చెందిన 7.85 లక్షల మందికి పైగా వరదల ప్రభావం తాకింది. ఇప్పటివరకు 2.77 లక్షల మందిని ప్రమాదకర ప్రాంతాల నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తాజాగా నమోదైన ఐదు మరణాల్లో మూడు గోడలు కూలిపోవడంతో సంభవించగా, మరో రెండు నీటిలో మునిగిపోవడంతో చోటుచేసుకున్నాయి. మరోవైపు పరిస్థితులు విషమించడంతో భద్రక్, సుందర్‌గఢ్, జాజ్‌పూర్ జిల్లాల్లో మంగళవారం పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను మూసివేశారు. భద్రక్‌లో వరద ప్రభావిత ఆరు బ్లాకుల్లోని 268 పాఠశాలలు, 567 అంగన్‌వాడీ కేంద్రాలను ఒకరోజు మూసివేయాలని ఆదేశించారు. రోడ్లు నీటమునగడం, ప్రతికూల వాతావరణం కారణంగా విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడం కష్టంగా మారిందని అధికారులు తెలిపారు. సుందర్‌గఢ్‌లో భారీ వర్షాల సూచన,వరద పరిస్థితుల నేపథ్యంలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను మూసివేశారు. జాజ్‌పూర్‌లో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఒడిశా ఆదర్శ విద్యాలయాల పాఠశాలలను మూసివేయాలని ఆదేశించారు.



## తెలంగాణ ఉద్యమకారుల కోసం..

# త్వరలో వెబ్‌సైట్ ప్రారంభం..

- చైర్మన్ కేశవరావుతో కమిటీ సభ్యుల అత్యున్నత స్థాయి భేటీ
- ఉద్యమకారుల వర్గీకరణ ముసాయిదా, సంక్షేమ విధివిధానాలపై సమీక్ష
- మిగిలి ఉన్న ఇతర ప్రజా సంఘాల ప్రతినిధులతోనూ చర్చించనున్న కమిటీ

హైదరాబాద్ సచివాలయ ప్రతినిధి(డీకే చాటింపు): తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కోసం త్వరలో వెబ్‌సైట్ లేదా వెబ్‌పోర్టల్ ప్రారంభం కానుంది. ఈ మేరకు తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఖరారు చేసింది. ఈ కమిటీ.. చైర్మన్ డాక్టర్ కె.కేశవరావు(కేకే) నివాసంలో మంగళవారం సమావేశమైంది. ఇందులో పాల్గొన్న కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు అత్యున్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఇందులో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, సభ్యులు మోతె శోభన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఇటీవల అమరదీపం వేదికగా 16 రోజుల పాటు 13 వేల మందికి పైగా ఉద్యమకారులు, ప్రజా సంఘాలు, వివిధ జేఏసీలతో నిర్వహించిన విస్తృత సంప్రదింపుల ద్వారా సేకరించిన అభిప్రాయాలు, విజ్ఞప్తుల ఆధారంగా రూపొందించిన "చర్చలపై ఒక ముసాయిదా నోట్"పై ఈ భేటీలో క్షుణ్ణంగా చర్చించారు. ఉద్యమకారుల వర్గీకరణ (కేటగిరీల విభజన) ముసాయిదాను పరిశీలించారు. సేకరించిన క్షేత్రస్థాయి సమాచారం ప్రకారం ఉద్యమకారులను కింది గ్రూపులుగా గుర్తించే విధానాన్ని కమిటీ ప్రాథమికంగా పరిశీలించింది. మొదటి కేటగిరీలో అమరుల కుటుంబాలు ఉంటాయి. ఉద్యమ క్రమంలో అమరులైనవారు సుమారు 1400 మంది వరకు ఉంటారని సమాచారం. వీరిలో కొందరికి మాత్రమే గతంలో సహాయం అందింది. మిగిలిన అర్హులైన అమరుల కుటుంబాలను ఇప్పుడు గుర్తించి పూర్తి న్యాయం చేస్తారు. రెండో కేటగిరీలోకి గాయపడిన ఉద్యమకారులు వస్తారు. పోలీసు కాల్పుల్లో, లాఠీఛార్జీల్లో శాశ్వత అంగవైకల్యం పొందినవారు, ఆత్మహత్యాయత్నాల్లో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను ఈ జాబితాలో చేర్చుతారు. మూడో కేటగిరీలోకి జైలు జీవితం గడిపినవారిని పొందుపరుస్తారు. తొలి దశ (1969), మలి దశ ఉద్యమాల్లో ప్రివెంటివ్ కస్టడీ, రిమాండ్, తీవ్ర జైలు శిక్షలు అనుభవించిన విద్యార్థులు, ఉద్యమకారులు వస్తారు. నాలుగో కేటగిరీ కింద.. కేసులు నమోదైనవారిని చేర్చుతారు. నాటి ఉద్యమ సమయంలో క్రిమినల్ కేసులు, బెయిలబుల్/నాన్-బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు ఎదుర్కొన్న శ్రేణులు వస్తాయి. ప్రత్యేక కేటగిరీలో.. సంస్థాగత ఉ క్రియాశీలక శ్రేణులు ఉంటాయి. కేసులు నమోదు కానప్పటికీ ఉద్యమ నిర్మాణంలో క్రియాశీలకంగా పాల్గొన్న ప్రభుత్వ ఉద్యోగులు, మహిళా ఉద్యమకారులు, ధూమ్-ధామ్ కళాకారులు, వివిధ సంస్థల సభ్యులు ఈ కేటగిరీలోకి వస్తారు. ఇదిలా ఉ



ండగా.. ఉద్యమకారుల ఆకాంక్షలు, సంక్షేమ అభ్యర్థనలు ఈ విధంగా ఉన్నాయి. ఒకటి.. సత్కారం-సహాయం-సహకారం: ఉద్యమకారులకు ఈ మూడు విధానాల్లో గౌరవం దక్కాలని కమిటీ స్పష్టం చేసింది. రెండు.. గుర్తింపు కార్డులు ఉ గౌరవ ప్రదానం: ఉద్యోగులు, వసతి కలిగినవారు కేవలం గుర్తింపు కార్డు/ప్రశంసా పత్రం ఆశిస్తున్నారు. నిరుపేద, నిరుద్యోగ యువత 250 గజాల ఇంటి స్థలం, నిర్మాణానికి ఆర్థిక సాయం, పెన్షన్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, పిల్లలకు ఉచిత విద్య, స్వయం ఉపాధి రుణాలు కోరుతున్నారు. మూడు.. చట్టబద్ధత ఉ కార్పొరేషన్: జార్ఖండ్, ఉత్తరాఖండ్ తరహాలో సంక్షేమ పథకాలకు పూర్తి చట్టబద్ధత కల్పించడంతోపాటు శాశ్వత కమిషన్ లేదా కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని సూచించారు. కమిటీ తక్షణ కార్యాచరణ నిర్ణయాలు ఇలా ఉన్నాయి.. సమీక్ష అనంతరం చైర్మన్ కేకే, కమిటీ సభ్యులు తదుపరి చేపట్టాల్సిన చర్యలను ఖరారు చేశారు. అవి.. ఉద్యమకారులు దరఖాస్తు చేసుకోవడానికి త్వరలోనే అధికారిక వెబ్‌సైట్/పోర్టల్ ద్వారా అవకాశం కల్పించడం. పారదర్శకమైన ఆన్‌లైన్ దరఖాస్తు నమూనాను సిద్ధం చేయడం. శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులతో విస్తృత స్థాయి చర్చలు జరపడం. మిగిలి ఉన్న ఇతర ప్రజా సంఘాల ప్రతినిధులతో సంభాషణలు పూర్తి చేయడం. ఇప్పటివరకు జరిగిన అన్ని చర్చల సమగ్ర నివేదికను, మినిట్స్‌ను రూపొందించి సీఎం ఎ.రేవంత్ రెడ్డికి సమర్పించడం.

## బోధన్ డివిజన్ లో ఘనంగా

# సర్వాయి పాపన్న జయంతి వేడుకలు

### మాజీ ఎమ్మెల్సీ రాష్ట్ర గౌడ సంఘం నాయకుడు వి గంగాధర్ గౌడ్ హాజరు.





నిజామాబాద్ ప్రతినిధి ఆగస్టు18(డీ కే చాటింపు): రుద్రూర్ మండల కేంద్రంలో గీత పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఆయన చిత్రపటానికి గౌడ కులస్తులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ రాష్ట్ర గౌడ సంఘం నాయకుడు విజి గౌడ్ హాజరై మాట్లాడుతూ. సామాన్యుల బడుగు బలహీన వర్గాల కోసం పోరాడిన మహనీయుడని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ తెలంగాణ గోల్కొండలోని జమీందారుల పెత్తందారులు వాళ్లందర్నీ తరిమికొట్టి వీరోచిత పోరాటం చేసి గోల్కొండ కోటపై జెండాను ఎగరవేయడం జరిగిందిని తెలిపారు. ఈరోజు హైదరాబాద్ ట్యాంక్ బండ్ పై గౌడ కులస్తుల ముద్దుబిడ్డ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కాస్య విగ్రహాన్ని తెలంగాణ ప్రభుత్వం ఆవిష్కరిస్తుంన్నందున హర్షం వ్యక్తం చేశారు. అనంతరం బస్టాండ్ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇందూరి సునీత చంద్రశేఖర్, ఉప సర్పంచ్ నిస్సార్, గౌడ సంఘం అధ్యక్షులు గుండూరి విఠల్ గౌడ్, గౌడ కులస్తులు సుదర్శన్ గౌడ్, గుండూరి ప్రశాంత్ గౌడ్, రాజు గౌడ్, గుండూరి శ్రీకాంత్ గౌడ్, సుధాకర్ గౌడ్, శ్రీను గౌడ్, రామ గౌడ్, నారా గౌడ్, పత్తి రాము, బీఆర్ఎస్ పార్టీ మండలఇంచార్జ్ గాండ్ల మధు తదితరులు పాల్గొన్నారు.

మోస్రా మండలం –

సర్వాయి పాపన్న గౌడ్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడిచి ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని గౌడ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం మోస్రా మండల కేంద్రంలో సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్వీట్లు పండ్లు పంపిణీ చేశారు. గౌడ సంఘం నాయకులు బొజ్జ స్వామి గౌడ్, నర్స గౌడ్, గంగాధర్ గౌడ్, వెంకట్ గౌడ్ ,శ్రీనివాస్ గౌడ్, సాయ గౌడ్, సుదర్శన్ గౌడ్ ,శేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

వర్ని మండలం :

వర్ని మండలం జాకోరా లో మంగళవారం సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని గౌడ సంఘం నాయకులు నిర్వహించారు. పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన చేసిన వీరోచిత పోరాటాలను గుర్తు చేసుకున్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు. జాకోరా సర్పంచ్ సాయిలు,విష్ణువర్ధన్ గౌడ్, రమేష్ గౌడ్ పాల్గొన్నారు. కోటగిరి మండలం: సర్వాయి పాపన్న అడుగు జాడల్లో , ఆయన ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తామని మాజీ ఎంపీటీసీ డీ గంగాధర్గౌడ్,ప్రెసిడెంట్ శంకర్ గౌడ్, పృథ్వీరాజ్ గౌడ్,మండల సీపీఐ నాయకుడు విఠల్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్,మల్లేశ్ గౌడ్ తదితర సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# ఇదీ పరిస్థితి,..... ఎటుపోతుంది సమాజం....

ఎల్బీనగర్, ఆగష్టు 18 (డీకే చాటింపు)సామజిక భాధ్యత లేని విదంగా పరిస్థితులునెలకొన్నాయి, పారిశుధ్య కార్మికులు కానివ్వండి, జిహెచ్ఎంసి కార్మికులు కానివ్వండి, రాజకీయ నాయకులు కానివ్వండి ఇలా తనకేమి పట్టనట్లుగా, రోజు తన కళ్ళముందే జరుగున్న కొన్ని అకృత్యాలు, డ్రైనేజి నాలాలు పొంగి పోర్లడం, మంచి నీటిలో పైపుల్లో డ్రైనేజి మురుగు నీరు కలవడం, ఎవ్వరికి పట్టడం లేదు ఎందుకీ వివక్ష ఎలక్షన్లలో ఓట్లకోసం వచ్చే రాజకీయ నాయకులకు ఈ విషయాలు ఇప్పుడు పాటించుకోరు, పారిశుధ్య కార్మికులు డ్రైనేజి లొ నుంచి తీసిన వ్యర్థాలను అలాగే కుప్పలుగా పోగు చేసి వదిలేస్తే అదే అలాగే ఉంది గాలికి అటు ఇటుపోతూ వర్షానికి మళ్ళీ ఆ గుంతలోకే వెళ్లడం, మళ్ళీ నిండడం ఇది నిరంతర ప్రక్రియ లాగా సాగుతుంది దీనికి శాశ్వత పరిష్కారం లేకుండా పోతుంది, ఏదైనా పండగలు పబ్బలు రాగానే, మేము గొప్ప నాయకులం అని గొప్పగా ఫ్లెక్సీలు రోడ్డుపై ఊరేగుతాయి కానీ కాలనీలో చిన్న సమస్యలు తీర్చరు, దానిపై స్పందించరు, ఇదెక్కడి న్యాయం, సామాన్య ప్రజానీకం ఓట్లు కావాలి కానీ సామాన్య ప్రజా సమస్యలు ఎందుకు పట్టించుకోరు,, ఓ ప్రజలారా సామజిక వేత్త లారా ఇది గమనించి, మున్ముందు మనకు పని చేసే వ్యక్తులకు మీరు మీ ఆయుధాన్ని వినియోగించండి, వారు ఇచ్చే తాయిలాలకు ఆశపడి మీ చుట్టుపక్కల సామాన్య జనాన్ని అగాధం లోకి లాగ కండి, ఎటుపోతుంది ఈ సామజిక న్యాయం ఒకటి కాదు రెండు కాదు, రోడ్లు బాగుండవు, రోడ్లపై ఉండే డ్రైనేజి లు బాగుండవు, మంచి నీళ్లల్లో కొన్ని ఏరియాలలో డ్రైనేజి కలుస్తున్నాం పట్టించుకునే నాధుడుండదు, ఎం చేస్తున్నారు ఈ కార్పొరేటర్లు, మీఈూ లు, చోట మోట నాయకులు వాళ్ళ గుర్తింపు కోసం రాజకీయ నాయకుల సంకలు నాకు కుంటూ వీటిని (ఈ సమస్య లను ) వారి దృష్టికి తీసుకెళ్లరు, మరి ఎవడు పట్టించుకోవాలి, ఈమధ్య ఎల్బ్ నగర్ లో చాలా కాలనీ ల్లో ఎక్కడ చూసిన డ్రైనేజిలు ఉదృతంగా సెలయేరులై పారుతున్నాయి, ఆ కంపరానికి రోడ్లపై జీవనం



గడిపే చిన్న వ్యాపాలు, ఆదివారం కూరగాయల మార్కెట్లు, నడుపునే వద్దకే అందరం తమకు కావలసిన నిత్యావసర వస్తువులను కొనడానికై వెళ్లి తోక్కరానిది తొక్కి పీల్చేదానిది పీల్చి ఏంతో మంది అనారోగ్యం పాలై, పోతున్నారు, అతి కొద్ది రోజుల్లోనే ఎన్నికలు రాబోతున్నాయి, గెలిచినా వాళ్ళే మళ్ళీ ఓట్లకు వస్తే కడిగి పడేయ్యండి, ఏది ఏమైనా రేపో మాపో ఓట్లకు వచ్చే వారు మన లోకల్ వారే ఉంటారు, మన సమస్యలు, మనం పడే కష్టాలు వారు చూసే ఉంటారు. కనుక ఆయుధం మన చేతిలో ఉంది, దీన్ని గ్రహించి సామజిక స్పృహ తో మంచి నాయకున్ని నిత్యం మనకు అందుబాటులో ఉండే వారిని ఆదరించండి, ఇది నిత్యం జరుగుతున్న సమస్యలను చూస్తూ చేసేది ఏమి లేక, ఒక సామాన్యుని ఆవేదన, ఎవ్వరిని కించపరచడానికి కాదు ఎవ్వరిని పొగడానికి కాదు, ఈ సభ్య సమాజం పై ఎవ్వరికి పట్టి పట్టనట్లు వ్యవహారిస్తున్నారు అన్న ఆవేదన మాత్రమే,సగటు వ్యక్తి.బ్రహ్మశ్రీ చిలుకూరి రామాచారి విశ్వకర్మ ఆర్ ట్సీ కాలనీ, ఎల్బ్ నగర్, ఐక్య వేదిక కన్వీనర్.

## లింగ నిర్ధారణ పరీక్షలపై

# ఉక్కుపాదం మోపాలి: జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

నిజామాబాద్ ప్రతినిధి ఆగస్టు 18 (డీ కే చాటింపు): పుట్టబోయే శిశువు అమ్మాయా, అబ్బాయా అని తెలియజేసేందుకు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై ఉక్కుపాదం మోపాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు. పుట్టబోయేది ఆడ శిశువు అని నిర్ధారణ చేసి, గర్భవిచ్ఛిత్తికి పాల్పడడం క్షమించరాని నేరమని, ఇది ఎంతో శోచనీయమని అన్నారు. ఈ తరహా చర్యలకు పాల్పడే వారిని ఎంతమాత్రం ఉపెక్షించకుండా, బాధ్యులపై ఎం.టి.పి చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వీ.సీ కాన్ఫరెన్స్ హాల్ లో కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం గర్భస్థపూర్వ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం జిల్లా స్థాయి సలహా సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లింగ నిర్ధారణ పరీక్షల నిరోధానికి చేపడుతున్న చర్యల విషయమై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకుని నివేదికలు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిటీ పనితీరు ఆశించిన స్థాయిలో లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. నామ్ కే వాస్తేగా సమావేశాలు నిర్వహించి తీర్మానాలు రాసుకోవడంతోనే సరిపెట్టుకోకుండా, లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న స్కానింగ్ కేంద్రాలపై క్షేత్ర స్థాయిలో గట్టి నిఘా ఉంచాలని అన్నారు. జనన వివరాలను అనుసరిస్తూ ఆడ, మగ నిష్పత్తిలో ఎక్కువ వ్యత్యాసం ఉంటే, లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తూ, భ్రూణ హత్యలు జరుగుతున్నట్లు భావించాల్సి వస్తుందన్నారు. ఈ తరహా వ్యత్యాసం ఎక్కువగా నగరాలు, పట్టణ ప్రాంతాలలోనే కనిపిస్తోందని, దీనిని బట్టి గుట్టు చప్పుడు కాకుండా లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలు జరుగుతున్నట్లు తెలుస్తోందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో గట్టి నిఘా ఉంచితే ఈ తరహా అమానవీయ ఘటనలకు ఆస్కారం ఉండదని సూచించారు. ఎన్ని కఠిన చట్టాలు ఉన్నా, వాటి అమలు సక్రమంగా లేకపోతే ఎలాంటి ప్రయోజనం ఉండదని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఇకపై జిల్లాలో ఎక్కడ కూడా లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలు జరుగకుండా గట్టి నిఘా పెట్టాలని, నిబంధలను




అతిక్రమించే వారిపై కేసులు నమోదు చేయాలని, స్కానింగ్ సెంటర్లను సీజ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గర్భం దాల్చిన నాటి నుండి గర్భిణీల వివరాలను పక్కాగా నమోదు చేయాలని, వారిలో ఎంతమందికి కాన్పు జరిగిందన్నది పరిశీలించాలన్నారు. గర్భం దాల్చిన మీదట కాన్పు జరగని కేసులను క్షుణ్ణంగా పరిశీలిస్తే, గర్భ నిర్ధారణ, గర్భ విచ్ఛిత్తి ఘటనలను గుర్తించేందుకు ఆస్కారం ఉంటుందని, తద్వారా ఈ చర్యలకు పాల్పడిన స్కానింగ్ సెంటర్లను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. పక్కాగా నిబంధనలు పాటించే స్కానింగ్ కేంద్రాలకే లైసెన్సులు రెన్యూవల్ చేయాలని ఆదేశించారు. పి.సి.పి.ఎన్.డి.టి, ఎం.టి.పీ చట్టాలను ఉల్లంఘించడం వల్ల సమాజంలో స్త్రీ, పురుషుల నిష్పత్తి గణనీయంగా తగ్గిపోతున్నదని ఈ సందర్భంగా కలెక్టర్ గుర్తు చేశారు. పుట్టబోయే శిశువు ఆడ, మగ ఎవరైనా సరే, అందరూ సమానమే అని ప్రజల్లో విస్తృతంగా అవగాహన కలిగించాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, ట్రైనీ కలెక్టర్ సురేష్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ, కమిటీ సభ్యులు ఎస్.సిద్దయ్య, బి.ఆంజనేయులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా అన్నదానం

### -నారాయణపేట టిసిఎస్ సొసైటీ ఆధ్వర్యంలో... -49వ,రోజుకు చేరినలయన్స్ క్లబ్ అన్నదానం కార్యక్రమం...

నారాయణపేట,(డీకే చాటింపు): లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట(320A)ఉచిత భోజన సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం(49వ రోజు)సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగానారాయణపేట టిసిఎస్ సొసైటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది.ఆకలి నివారణ- ఒక ప్రపంచ సేవా కార్యక్రమంలో భాగంగా 350 మందికి ఉచిత భోజనం అందించినట్లు స్థానిక లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ రవికుమార్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం1గంట నుంచి 2 గంటల వరకు స్థానిక శ్రీ సత్యనారాయణ కమాన్ దగ్గర అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదానం కార్యక్రమాన్నినారాయణపేట టిసిఎస్ సొసైటీ స్పాన్సర్ చేసింది.ఈ కార్యక్రమంలో లయన్స్ సభ్యులు లయన్ రవి కుమార్ గౌడ్,లయన్ మోహన్ కుమార్ కోన, లయన్ రాజేష్ పొల్లేపల్లి,లయన్ హరి నారాయణ బట్టాడ్ పిడిజి,లయన్ కన్న జగదీష్,లయన్ శ్రీనివాస్ లహోటి,లయన్ కృష్ణమూర్తి, లయన్ భీమ్ చందర్ గౌడ్, లయన్ వెంకటయ్య,లయన్ డాక్టర్ ఆంజనేయులు ఆర్మీ,లయన్ ఎస్.చక్రవర్తి తదితరులు పాల్గొని విజయవంతం చేయడంలో తమ వంతు సహకారం అందించారు.




## నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో

# కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం...

### - ఆగస్టు 20న నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నా జయప్రదం చేయండి - జోగు ప్రకాష్ సిపిఎం జనగామ పట్టణ కార్యదర్శి

జనగామ ఆగస్టు 18 డీకే చాటింపు జిల్లా ప్రతినిధి:దేశంలో యువతకు తగిన ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని సిపిఎం పార్టీ జనగామ నగర కార్యదర్శి జోగు ప్రకాష్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రమైన జనగామ లోని సిపిఎం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ చదువులు పూర్తి చేసి ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు ప్రభుత్వాల విధానాలు తీవ్ర నిరాశ కలిగిస్తున్నాయన్నారు. ప్రభుత్వ శాఖల్లో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయకుండా కాలయాపన చేయడం వల్ల నిరుద్యోగ సమస్య మరింత తీవ్రమవుతోందని,దేశవ్యాప్తంగా జూలైలో మొత్తం నిరుద్యోగిత రేటు 5.1 శాతంగా నమోదైనట్లు తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయని వివరించారు.నిరుద్యోగ యువతకు వెంటనే ఉపాధి కల్పించడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని అన్ని ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి చెల్లించాలని ఈ సందర్భం గా డిమాండ్ చేశారు.ఈ డిమాండ్ల సాధన కోసం ఆగస్టు 20వ తేదీన ఉదయం 11 గంటలకు జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించే నిరసన కార్యక్రమానికి యువత, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ప్రకాష్ పిలుపునిచ్చారు.



డీకే సారధ్యంలో చాటింపు
తెలంగాణ దిన పత్రిక

బుధవారం, ఆగస్టు,19, 2026

# ప్రజారోగ్యంపై కల్తీ ప్రభావం...!

నిత్యం మనం తీసుకునే ఆహారం అమృతం కావాలి. కానీ నేడు అది నెమ్మదిగా ప్రాణాలను హరించే విషంగా మారుతోంది. లాభాపేక్ష అనే రాక్షసి కోరల్లో చిక్కుకున్న ఆహార రంగం, సామాన్యుడి ఆరోగ్యంతో చెలగాటమాడుతోంది. 'సర్వం కల్తీమయం' అన్నది కేవలం ఒక నానుడి కాదు. నేడు అది మన కళ్లముందు కదలాడుతున్న భయంకర వాస్తవం. భారతదేశంలో సామాన్య ప్రజల జీవన ప్రమాణాలు పెరగడం అటుంచితే, కనీస ఆరోగ్య భద్రత కరువవ్వడం ఆందోళన కలిగించే అంశం. వాతావరణ కాలుష్యం ఒకవైపు ఊపిరితిత్తులను ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే, మరోవైపు మనం తినే ఆహారంలో చేరుతున్న రసాయనాలు నిశ్శబ్దంగా మృత్యువును ఆహ్వానిస్తున్నాయి. ఉదయం నిద్రలేచిన దగ్గరి నుండి వాడే టూత్‌పేస్ట్, పాలు, టీపొడి, వంటనూనె, పప్పుధాన్యాలు.. ఇలా ఒకటేమిటి, ఏ వస్తువును తాకినా అందులో కల్తీ ఉందన్న వార్తలు వినియోగదారుడి వెన్నులోవణుకు పుట్టిస్తున్నాయి. గతంలో కల్తీ అంటే ఏదో ఒక వస్తువులో తక్కువ నాణ్యత గల పదార్థాలను కలపడం అని అనుకునేవారు. కానీ నేడు అది ఒక వ్యవస్థీకృత నేరంగా రూపాంతరం చెందింది. ఇటీవల దేశవ్యాప్తంగా జరిగిన దాడులు చూస్తుంటే, ఒక భారీ నెట్‌వర్క్ దీని వెనుక ఉన్నట్లు అర్థమవుతోంది. పాలు, పాల ఉత్పత్తులు: సూరత్ వంటి నగరాల్లో యూరియా, డిటర్జెంట్, ప్రాణాంతక రసాయనాలతో 'సింథటిక్ పాలు' తయారు చేయడం మానవత్వం లేని చర్య. పసిపిల్లలు తాగే పాలపై కూడా కనికరం లేని లాభాపేక్ష ఇది. పన్నీర్, నెయ్యిలో జంతువుల కొవ్వును కలపడం వంటి ఘటనలు ఆధ్యాత్మిక భావనలతోపాటు ఆరోగ్య భద్రతను కూడా దెబ్బతీస్తున్నాయి. ఢిల్లీలో వెలుగులోకి వచ్చిన నకిలీ టూత్‌పేస్ట్ తయారీ కేంద్రం మన దైనందిన జీవితంలో ఏ వస్తువునూ నమ్మలేమని నిరూపించింది. బ్రాండెడ్ కంపెనీల పేర్లతో నకిలీ ప్యాకింగ్ చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. రీ-లేబులింగ్ మాఫియా: గడువు ముగిసిన సాఫ్ట్‌డ్రింక్స్, ప్యాక్డ్ ఫుడ్స్‌పై పాత తేదీలను చెరిపివేసి కొత్త తేదీలు ముద్రించడం ద్వారా వినియోగదారుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ప్రస్తుత ఆధునిక సమాజంలో నగర జీవనం చాలా వేగంగా మారిపోయింది. ఉరుకులు పరుగుల జీవితంలో సొంతంగా వంట చేసుకునే తీరిక లేక చాలామంది బయటి ఆహారంపై ఆధారపడుతున్నారు. బిర్యానీ సెంటర్లు, టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్ ఫుడ్ అవుట్‌లెట్లు నేడు ప్రతి గల్లీలోనూ దర్శనమిస్తున్నాయి. అయితే, ఈ కేంద్రాల్లో శుభ్రత అనేది మచ్చుకైనా కనిపించడం లేదు. హైదరాబాద్ వంటి నగరాల్లో వెలుగులోకి వచ్చిన అల్లం-వెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రాల పరిస్థితి దారుణం. కుళ్ళిన అల్లం, వెల్లుల్లికి రంగులు, రసాయనాలు కలిపి ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో హోటళ్లకు సరఫరా చేస్తున్నారు. ఇలాంటి పదార్థాలను వాడటం వల్ల హోటల్ ఆహారం రుచికరంగా ఉన్నట్లు అనిపించినా, అది లోలోపల అవయవాలను చిత్తు చేస్తోంది. కల్తీ ఆహారం అనేది కేవలం ఒక వ్యక్తిగత సమస్య కాదు, ఇది దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద ప్రజారోగ్య సంక్షోభం. కల్తీ వల్ల కలిగే నష్టాలు తక్షణమే బయటపడవు. కానీ దీర్ఘకాలంలో అవి ప్రాణాంతకమవుతాయి. కేన్సర్ ముప్పు: వైద్య నిపుణుల నివేదికల ప్రకారం, దేశంలో నమోదవుతున్న కేన్సర్ కేసుల్లో సుమారు 53% ఆహారపు అలవాటు, కల్తీ ఆహారం వల్లే సంభవిస్తున్నాయి. ఆహారంలో కలిపే కృత్రిమ రంగులు కార్సినోజెనిక్‌గా మారుతున్నాయి. కలుషిత నీరు, కల్తీ పాలు, నాణ్యత లేని నూనెల వల్ల కాలేయం, మూత్రపిండాలు దెబ్బతింటున్నాయి. చిన్న వయస్సులోనే గుండెపోటులు రావడం వెనుక కల్తీ నూనెల ప్రభావం ఎంత ఉందో విశ్లేషించాల్సిన అవసరం ఉంది. పాలలో కలిపే ఆక్సిటోసిన్ వంటి హార్మోన్ల వల్ల పిల్లల ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం పడుతోంది. నిఘా వైఫల్యం ప్రశ్నలపై ఉక్కుపాదం ఆహార భద్రతా ప్రమాణాలను పర్యవేక్షించాల్సిన 'ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా', రాష్ట్ర ప్రభుత్వాల ఆరోగ్యశాఖలు క్షేత్రస్థాయిలో విఫలమవుతున్నాయని చెప్పక తప్పదు. తనిఖీలు కేవలం పండుగ సీజన్లకు లేదా ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే పరిమితం కాకూడదు. మరోవైపు, సోషల్ మీడియా యుగంలో ప్రజలు చైతన్యవంతులవుతున్నారు. ఆహార నాణ్యతను ప్రశ్నించే వారిపై రివర్స్ కేసులు నమోదు చేయడం లేదా వారిని వేధించడం ప్రజాస్వామ్య విరుద్ధం.

విలేకరులు కావలెను

రాజకీయ సంచలనాలకు ప్రతీకగా నిలిచిన

డీకే సారధ్యంలో చాటింపు
తెలంగాణ దినపత్రిక


డీకే సారధ్యంలో చాటింపు దినపత్రికలో పనిచేయడానికి తెలంగాణాలోని అన్ని జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో పనిచేయడానికి ఆసక్తి, అనుభవం గల విలేకరులు కావలెను.

సంప్రదించండి :

సెల్ : 9603754136 - 7386287837

# సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ధర్నా



క్యాతన్ పల్లి(డీకే చాటింపు): రామకృష్ణాపూర్ మంగళవారం యూనియన్ బ్యాంక్ కార్యాలయం ఎదుట మంచిర్యాల జిల్లా సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సింగరేణిలో విధులు నిర్వహించి పదవి విరమణ చేసిన యూనియన్ బ్యాంక్ లో ఖాతాలు కలిగి ఉన్న 70 సంవత్సరాలలోపు ఉద్యోగులకు 30 లక్షల ప్రమాద బీమా కల్పించానందుకు నిరసన గా నల్ల బ్యాడ్జీలు ధరించి యూనియన్ బ్యాంకు కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య మాట్లాడుతూ... 2024 ఫిబ్రవరి 26 వ తేదీన సింగరేణి యాజమాన్యంతో యూనియన్ బ్యాంక్ చేసుకున్న ఒప్పందం మేరకు 30 లక్షల ప్రమాద బీమా అమలు చేయాల్సిన యూనియన్ బ్యాంక్ యాజమాన్యం గత 2 సంవత్సరాల, విశ్రాంత ఉద్యోగులకు 30 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాల్సి ఉన్నప్పటికీ , యూనియన్ బ్యాంక్ యాజమాన్య నిర్లక్ష్యం వల్ల ఎంతో మంది విశ్రాంత కుటుంబాలు నష్టపోతున్నాయని పేర్కొన్నారు.సింగరేణి యాజమాన్యంతో యూనియన్ బ్యాంక్ యాజమాన్యం చేసుకున్న ఒప్పందం మేరకు సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు వెంటనే 30 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేసినారు. లేని ఎడల అన్ని యూనియన్ బ్యాంకుల కార్యాలయాల ముందు విశ్రాంత ఉద్యోగుల కుటుంబాలతో పెద్ద ఎత్తున శాంతియుతంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణపూర్ యూనియన్ బ్యాంక్ మేనేజర్ వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, సలహాదారులు ఎం అంజయ్య , ఆర్ రమేష్ ,కుమ్మరి మల్లయ్య , కార్యదర్శి పోతురాజుల చంద్రయ్య , రాష్ట్ర జిల్లా సంఘం నాయకులు కాల్వల నర్సయ్య , జి రామయ్య , పి రాజలింగు , అ నారాయణ , పి రామ రావు , సిఎచ్ మల్లేష్ , సిఎచ్ పోచెట్టి , మిట్ట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## భద్రకాళి బండ్ పై సందర్శకులకు

# అందుబాటులోకి బ్యాటరీ వెహికల్

**- వెహికల్ సేవలను ప్రారంభించిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి- ఎమ్మెల్యేతో పాటు పాల్గొన్న, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, అధికారులు**





హన్మకొండ 0 (డి. కె. చాటింపు) భద్రకాళి బండ్ పై సందర్శకుల సౌక ర్యార్థం బ్యాటరీ వెహికల్ సేవలు మంగళవారం అందుబాటులోకి వచ్చాయి. ఈ సేవలను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై బ్యాటరీ ఆపరేటెడ్ వెహికల్ ను ప్రారంభించారు. నూతనంగా అందుబాటులోకి వచ్చిన బ్యాటరీ వెహికల్ ను ప్రారంభించిన అనంతరం కుడా సిపిఓ అజిత్ రెడ్డి నడపగా ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, తదితరులు భద్రకాళి బండ్ పై ప్రయాణించారు. ఫాతిమ కెనరా బ్యాంక్ తన కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ ఫండ్స్ కింద కొనుగోలు చేసిన బ్యాటరీ వెహికల్ ను కుడా కు అందజేశారు. కాగా ఈ వెహికల్ ను ఎమ్మెల్యే చేతులకు మీదుగా ప్రారంభించడంతో సందర్శకుల సౌకర్యార్థం ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ సందర్భంగా కుడా ఈఈ భీమ్ రావు, కెనరా బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

## సర్వాయిపాపన్నగౌడ్

# పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలి

**అదనపు కలెక్టర్ భుజంగరావు**





నిజామాబాద్ విలేకరి, ఆగస్టు 18 (డీ కే చాటింపు): సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కొనసాగించిన పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలని వక్తలు పిలుపునిచ్చారు. సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వినాయకనగర్ లో గల సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి అదనపు కలెక్టర్ భుజంగరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన జయంతి వేడుకల సందర్భంగా సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, పోరాట యోధుడు పాపన్నగౌడ్ జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని గుర్తు చేశారు. దౌర్జన్యాలు, అణిచివేతలకు వ్యతిరేకంగా పోరాడిన ధీశాలి సర్వాయి పాపన్న అని గుర్తు చేశారు. పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తితో హక్కుల సాధనకు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. వేలాది మందితో సైన్యాన్ని సమీకరించుకుని పన్నుల వ్యవస్థ లేని గొప్ప పరిపాలనను పాపన్న గౌడ్ అందించారని కొనియాడారు. గోల్కొండ కోటను సైతం పాలించడం సర్వాయి పాపన్న ధైర్య సాహసాలను చాటుతోందన్నారు. సర్వాయి పాపన్నగౌడ్ మార్గదర్శకత్వం ఎంతో అనుసరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, బీసీ సంఘాల నాయకులు, గౌడ సంఘాల ప్రతినిధులు, గీత వృత్తిదారులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కర ఏర్పాట్ల పనులను ప్రణాళికా బద్ధంగా చేపట్టాలి

## - అధికారులకు కలెక్టర్ భవేష్ మిశ్రా దిశానిర్దేశం-యంచ వద్ద పుష్కరఘాట్ నిర్మాణానికి అనువైన స్థలం పరిశీలన



నిజామాబాద్ ప్రతినిధి ఆగస్టు 18(డీ కే చాటింపు) : గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. నవీపేట మండలం యంచ వద్ద పుష్కర ఘాట్ నిర్మాణానికి నిధులు మంజూరైన నేపథ్యంలో కలెక్టర్ మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో కలిసి అనువైన స్థలం కోసం క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులతో ముఖాముఖి భేటీ అయి, వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. యంచ గ్రామ శివారులో ఎక్కడ పుష్కర ఘాట్ ఏర్పాటు చేస్తే భక్తులకు అనుకూలంగా ఉంటుంది, అవసరమైన స్థలం అందుబాటులో ఉందా, రవాణా వసతి, ఇతర సదుపాయాలు, భద్రతాపరమైన అంశాలు తదితర వాటి గురించి సంబంధిత అధికారులతో కలెక్టర్ చర్చించారు. క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపిన అన్ని అంశాలను క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిస్తామని, ప్రభుత్వం నిర్ధారణ చేసిన ప్రాంతంలోనే పుష్కరఘాట్ నిర్మాణం చేపడతామని కలెక్టర్ స్పష్టం చేశారు. పరిశీలన జరిపిన ప్రాంతంలో ప్రభుత్వ స్థలం ఏమేరకు అందుబాటులో ఉంది, పట్టా భూములు ఎంత విస్తీర్ణంలో ఉన్నాయన్నది పక్కాగా సర్వే నిర్వహించి వారం రోజుల్లోపు మార్కింగ్ పూర్తి చేయాలని స్థానిక రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలను అట్టహాసంగా నిర్వహించేలా ప్రభుత్వం సంకల్పించిన దృష్ట్యా, విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. భక్తులకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా పనులను చేపట్టి, నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలన్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర దేవాలయం యంచ గ్రామానికి అత్యంత చేరువలో ఉన్నందున గోదావరి పుష్కర పుణ్య స్నానాల కోసం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున లోటుపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. కలెక్టర్ వెంట రెవెన్యూ, ఇరిగేషన్, ఎండోమెంట్, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు ఉన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

**డాక్టర్స్ కాలనీ డివిజన్ అధ్యక్షులు నల్లెంకి ధన్ రాజ్ గౌడ్**



మహేశ్వరం, ఆగస్టు 18 (డీకే చాటింపు):తెలంగాణ వీరత్వానికి, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన గొప్ప యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనం గా నివాళులర్పించిన డాక్టర్స్ కాలనీ డివిజన్ అధ్యక్షులు నల్లెంకి ధన్ రాజ్ గౌడ్ నల్లెంకి ధన్ రాజ్ గౌడ్ మాట్లాడుతూ అణగారిన వర్గాల కోసం ఆయన చూపిన ధైర్యం, త్యాగం చిరస్మరణీయమని, పాపన్న గౌడ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనందరి బాధ్యత అని తెలిపారు.

# నూతన వస్త్రాలతో శ్రీ రేణుకా ఎల్లమ్మకు విశేషాలంకరణ......



జనగామ ఆగస్టు 18 డీకే చాటింపు జిల్లా ప్రతినిధి:జిల్లా కేంద్రమైన జనగామ నగరంలోని మూడో వార్డు పరిధిలో ఉన్న బాలాజీనగర్‌లోని శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా అమ్మవారని భిన్న రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనమిస్తున్నారు.శ్రావణ మంగళవారం సందర్భంగా అమ్మవారిని నూతన వస్త్రాల(చీరల)తో అలంకరించారు.ఆలయ పూజారి మారుపాక శ్యాంప్రసాద్ పర్యవేక్షణలో జరిగిన ఈ ప్రత్యేక అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. దీప కాంతుల మధ్య దివ్యంగా వెలిగిన అమ్మవారిని దర్శించేందుకు భక్తులు హాజరై మంగళహారతులు సమర్పించారు.ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. 61 రంగురంగుల పట్టుచీరలతో అమ్మవారిని సుందరంగా అలంకరించి భక్తులకు కనువిందు చేసేలా ప్రత్యేక అలంకరణ చేశారు.మహిళలు భక్తి శ్రద్ధలతో పాల్గొని అమ్మవారికి పూజలు,కుంకుమార్చనలు నిర్వహించారు.శ్రావణ మాసంలో అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహిస్తే అమ్మవారి కృప,ఆశీస్సులు లభిస్తాయని విశ్వాసంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో దూడల శోభారాణి,లగిశెట్టి పద్మావతి, మెరుగు సరోజన,దోసపాటి శ్రీ లక్ష్మి, లోనే మంజుల,ఆలేటి పద్మ,సృజన, అంబటి సుజాత,బోగ రజిని, పొత్కనూరి మౌనిక, గొరిగే శోభన,సునీత,గట్టు విజయ, తుంకుంట్ల విజయ,పోగుల కవిత, వాణి,జ్యోతి,రాంపురం అనిత, మానస,అయిత కళావతి,రమ, భార్గవి,భాగ్యలక్ష్మి,చింత లక్ష్మి,అర్జుల సంధ్య,కుక్కల అంజలి, మినులాపురం శోభ తదితరులు పాల్గొన్నారు.

# జన్యులోపమే పార్కిన్సన్‌కు మూలం

18వ శతాబ్దంలో జేమ్స్ పార్కిన్ సన్ అనే ఆంగ్లవైద్యుడు ఒళ్ళు ఒణుకు వ్యాధి అనే పేరుతో మొదట దీన్ని నిర్వచించిన కారణంగా పార్కిన్సన్స్ వ్యాధి అంటారు. ఈ వ్యాధి వేదకాలంలోనే ప్రస్తావించబడింది. ఆయుర్వేద సంహితలో అంటే ప్రాచీన భారతీయ వైద్యశాస్త్రంలో ఈ వ్యాధి, దాని లక్షణాలు, చికిత్స పేర్కొన బడ్డాయి. నాటి వైద్యశాస్త్ర నిపుణులు దీన్ని కంపవాత మన్నారు. 2500 సంవత్సరాలకు పూర్వమే నైజింగ్ (ఔవతిఏతినిణ) అనే చైనా వైద్యశాస్త్రంలో దీని గురించిన ప్రస్తావన వుంది. కంపవాతం ఆయుర్వేద రీత్యా ఒక నరాల జబ్బు. ఈ వ్యాధి సోకిన మనిషి కదలికలో వ్యత్యాసం కనిపిస్తుంది. కూర్చొని, పడుకొని ఉన్నంతసేపూ బాగుంటాడు. కాని లేచి నిలబడి కదలబోతే శరీరం వణికి ఇటూ అటూ కదిలిపోతూ పడిపోతుంటాడు. పార్కిన్సన్ వ్యాధిని ఇప్పటికీ కారణం తెలియని వ్యాధిగానే పరిగణిస్తు న్నారు. జన్యుపరంగా, పర్యావరణ కారణాలవల్ల ఈ వ్యాధి వస్తుంది. పర్యావరణ కాలుష్యం విషపదార్థాలు, ఎరువులు, డ్రగ్స్ (యాంటీ సైకోటికో, వాంతి వచ్చే మందులు) తయారీ, తరచుగా తలనొప్పి తదితర కారణాలతో పార్కిన్సన్ వ్యాధి ముడిపడి ఉంది. మెదడులో ఉత్పన్నమయ్యే డోపమైన్ కణాలు తగ్గిన పక్షంలో ఈ వ్యాధి వచ్చినట్టు నిర్ధారణ చేసుకోవచ్చు. ప్రొటీనోపతి (ప్రోటీన్లకు సంబంధించిన రుగ్మత) వల్ల పార్కిన్సన్ వ్యాధివచ్చే అవకాశముంది. పార్కిన్సన్ వ్యాధి సర్వసాధారణ వ్యాధి. ఇది సమాజంలో ప్రబలంగా ఉంది. 60 ఏళ్లు దాటిన వయోవృద్ధులకు ఇది వస్తుంది. దీన్ని వృద్ధాప్యంలో వచ్చే అంగవైకల్య వ్యాధిగా పరిగణిస్తారు. "వణుకుడు రోగం" లేక "పార్కిన్సన్స్ వ్యాధి" నాడీ కణాలను (నరాల కణాలను) దెబ్బ తీయడం ద్వారా ప్రగతిశీల మెదడు దెబ్బకు దారితీస్తుంది. 'డోపమైన్' అని పలవబడే న్యూరోట్రాన్స్మిటర్ ద్వారా మెదడు అంతటా సంకేతాలు ప్రసరించే బాధ్యత ఈ నాడీ కణాలదే. సాధారణ పరిస్థితులలో, మృదువైన, సమతుల్య కండరాల సమన్వయాన్ని డోపమైన్ సహాయంతో సాధించవచ్చు. ఈ డోపామైన్ అనే ఈ న్యూరోట్రాన్స్మిటర్ లేకపోవడం మూలంగానే "పార్కిన్సన్స్ వ్యాధి" లేక వణుకుడు రోగం మనుషుల్లో సంభవిస్తుంది.

# యశోద కేర్ హాస్పిటల్స్‌లో అధునాతన వైద్య సేవలు

**-ల్యాపరోస్కోపిక్ వజైనల్ హిస్టరెక్టమీ శస్త్ర చికిత్సలు... -పేషంట్లకు పెద్ద కోతలు,కుట్లు లేకుండానే ల్యాపరోస్కోపిక్ వజైనల్ హిస్టరెక్టమీ ద్వారా శస్త్రచికిత్సలు... -హైదరాబాద్ స్థాయి వైద్య శస్త్రచికిత్స నారాయణపేట యశోద కేర్ హాస్పిటల్స్ లో... -ఆనందంలో పేషంట్ల కుటుంబ సభ్యులు...**

నారాయణపేట,(డీకే చాటింపు): నారాయణపేట జిల్లా ప్రజలకు అధునాతన వైద్య సేవలను స్థానికంగానే అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో పనిచేస్తున్న నారాయణపేట ఓల్డ్ గంజ్,యశోద కేర్ హాస్పిటల్స్ మరో ముఖ్యమైన వైద్య విజయాన్ని సాధించి ప్రశంసలు అందుకుంది. యశోద కేర్ హాస్పిటల్స్‌లో ఇద్దరు మహిళలకు అధునాతన ల్యాపరోస్కోపిక్ వజైనల్ హిస్టరెక్టమీ శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించారు. హైదరాబాద్ వంటి మహానగరాల్లోని అధునాతన ఆసుపత్రుల్లో అందుబాటులో ఉండే క్లిష్టమైన,ఖరీదైన ల్యాపరోస్కోపిక్ శస్త్ర చికిత్సను నారాయణపేట యశోద కేర్ హాస్పిటల్స్ అత్యల్ప ఖర్చుతో విజయవంతంగా నిర్వహించింది. ఈ ఆస్పత్రిలో ఇద్దరు మహిళలకు ఇటీవల ల్యాపరోస్కోపిక్ వజైనల్ హిస్టరెక్టమీ శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించారు. నారాయణపేట పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన 56 ఏళ్ల మహిళ చాలా కాలంగా అధిక రక్తస్రావంతో బాధపడుతున్నారు. వైద్య పరీక్షల్లో గర్భాశయంలో పెద్ద పరిమాణంలో ఫైబ్రాయిడ్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. అలాగే మరికల్ మండలం బుడ్డగాని తండాకు చెందిన 55 ఏళ్ల మహిళ కూడా తీవ్రమైన అధిక రక్తస్రావంతో బాధపడుతున్నారు. వైద్య పరీక్షల్లో గర్భాశయంలో బహుళ ఫైబ్రాయిడ్లు ఉన్నట్లు డాక్టర్లు గుర్తించారు. ఇద్దరు రోగుల ఆరోగ్య పరిస్థితిని పూర్తిగా పరిశీలించిన అనంతరం అవసరమైన వైద్య నిర్ణయాలు తీసుకొని ల్యాపరోస్కోపిక్ వజైనల్ హిస్టరెక్టమీ శస్త్రచికిత్సను అనుభవజ్ఞులైన నిపుణుల ఆధ్వర్యంలో క్లిష్టమైన శస్త్రచికిత్సలను అనుభవజ్ఞులైన సీనియర్ ల్యాపరోస్కోపిక్ శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ రాజ్ కుమార్ మంచాల,ఎం.బి.బి. ఎస్,ఎం.ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మత్తు వైద్య నిపుణులు డాక్టర్ నీలా వర్ణ ఎం.డి ఆధ్వర్యంలో మత్తు వైద్య సేవలు అందించబడ్డాయి. ఈ ఇద్దరు పేషెంట్లకు శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి చేయడంలో యశోద కేర్ హాస్పిటల్స్ శస్త్రచికిత్సా విభాగం బృందం కీలక పాత్ర పోషించిందని చెప్పవచ్చు. పెద్ద కోతలు,కుట్లు లేకుండానే ల్యాపరోస్కోపిక్ వజైనల్ హిస్టరెక్టమీ ద్వారా పేషంట్లకు శస్త్రచికిత్సలు నిర్వహించారు. కుట్లు చాలా తక్కువగా ఉండటం లేదా బయట కుట్లు అవసరం లేకపోవడం. తక్కువ నొప్పి,తక్కువ శస్త్రచికిత్స



గాయాలు. త్వరగా కోలుకునే అవకాశం. తక్కువ సమయంలోనే ఆసుపత్రిలో బస. సాధారణ జీవన విధానానికి త్వరగా తిరిగి చేరే అవకాశం వంటి ప్రయోజనాలతో ఈ శస్త్రచికిత్సలు నిర్వహించారు. శస్త్ర చికిత్సలు విజయవంతంగా పూర్తై, రోగులు ఆరోగ్యంగా కోలుకోవడంతో వారి కుటుంబ సభ్యులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. ఇలాంటి ఖరీదైన,క్లిష్టమైన శస్త్రచికిత్స కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా నారాయణపేటలోనే అత్యల్ప ఖర్చుతో వైద్యం అందించడం ఎంతో సంతోషంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రజలు క్లిష్టమైన వైద్య చికిత్సల కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గేలా, అధునాతన వైద్య సదుపాయాలు, అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు,ఆధునిక శస్త్రచికిత్సా సేవలను యశోద కేర్ హాస్పిటల్స్ అందిస్తుంది. "హైదరాబాద్ స్థాయి అధునాతన శస్త్రచికిత్సలు– ఇప్పుడు నారాయణపేటలోనే ప్రజలకు అందుబాటు ఖర్చుతో యశోద కేర్ హాస్పిటల్స్ ఓల్డ్ గంజ్, నారాయణపేట అధునాతన వైద్యం, అనుభవజ్ఞులైన నిపుణులు, అందుబాటు ఖర్చు నాణ్యమైన రోగి సేవలు. ప్రజల ఆరోగ్యం మా ప్రధాన లక్ష్యం లక్ష్యమని ఆస్పత్రి వైద్య బృందం పేర్కొంది.


# మిత్రపక్షాల మధ్య డిజిటల్ వార్

విజయవాడ, : ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమి తమ సోషల్ మీడియా శ్రేణులను అప్రమత్తం చేస్తూ ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. కొద్దిరోజులుగా సోషల్ మీడియా వేదికగా టీడీపీ, జనసేన సైనికుల మధ్య సాగుతున్న పరస్పర విమర్శలు, వ్యక్తిగత దూషణలు శృతిమించి కూటమి ఐక్యతకే సవాలుగా మారిన తరుణంలో నాయకత్వం ఈ దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టింది. గొడ్డలి పార్టీ కుట్రపూరితంగా సృష్టించిన నకిలీ ఖాతాల వల్ల ఈ అంతర్గత కలహాలు నడుస్తున్నాయని, ఆ ట్రాప్‌లో పడ వద్దని కూటమి సోషల్ మీడియా కోఆర్డినేషన్ కమిటీ స్పష్టమైన ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది. కొన్ని వారాలుగా సోషల్ మీడియాను గమనిస్తే.. పశ్చిమ ఏపీలోని అధికార సమన్వయం నుంచి మొదలుకొని, సినిమాలు, ఐకాన్స్, రాజకీయ ప్రాధాన్యతల వరకు టీడీపీ–జనసేన క్యాడర్ మధ్య ఘాటైన సైబర్ యుద్ధమే సాగుతోంది. సినిమాల నుంచి సీనియర్ ఎన్టీఆర్ ఆహారపు అలవాట్ల వరకూ తీవ్రస్థాయిలో ఎదురుదాడి చేసుకోవడం నిత్యకృత్యమైంది. గ్రౌండ్ లెవల్‌లో నాయకుల మధ్య సఖ్యత ఉన్నప్పటికీ, సోషల్ మీడియా డిజిటల్ స్పేస్‌లో చోటుచేసుకుంటున్న ఈ తీవ్ర స్వభావపు విమర్శలు అసలైన కార్యకర్తల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీయడమే కాకుండా, ప్రత్యర్థులకు బలమైన రాజకీయ ఆయుధాన్ని అందించాయి. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని విపక్ష వైసీపీ సైబర్ వింగ్ అత్యంత వ్యూహాత్మకంగా సూడో అకౌంట్స్ నడుపుతోందని కూటమి సంయుక్త ప్రకటన ఎండగట్టింది. ఒక టీడీపీ అభిమానిలా ప్రొఫైల్ రూపొందించి పవన్ కల్యాణ్‌ను హేళన చేయడం, అలాగే జనసేన సైనికుడి ముసుగులో చంద్రబాబు లేదా లోకేష్‌లను వ్యక్తిగతంగా విమర్శించడం ద్వారా ఇరు వర్గాల అసలైన కార్యకర్తలను



రెచ్చగొడుతున్న వైనాన్ని కమిటీ గుర్తించింది. ఈ డిజిటల్ ట్రాప్ వల్ల నిజమైన సైనికులు ఆవేశానికి లోనై ఒకరినొకరు కించపరుచుకుంటూ, చివరికి తమ సొంత ప్రభుత్వ విజయావకాశాలను, పథకాల ప్రచారాన్ని పక్కనబెట్టి అంతర్గత పోరులోనే శక్తిని వృధా చేసుకుంటున్నారు. రాజకీయాల్లో క్షేత్రస్థాయి ఐక్యత ఎంత ముఖ్యమో, డిజిటల్ మైండ్ స్పేస్‌లో పొత్తు ధర్మాన్ని నిలబెట్టుకోవడం కూడా అంతే కీలకం. శ్రేణుల మధ్య స్వల్ప విబేధాలు కాస్తా పార్టీల అగ్రనేతల మధ్య వైరి వర్గాలుగా రూపాంతరం చెందే ప్రమాదం ఉందని గ్రహించినందునే ఈ ఉమ్మడి ప్రకటన వెలువడింది. సంయమనం పాటించకపోతే, మిత్రపక్షాల నేతలను లక్ష్యంగా చేసుకుని విద్వేషం చిమ్మే ఏ అకౌంట్‌పైనా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేయడం మంచి పరిణామం అనుకోవచ్చు. ఆవేశాన్ని పక్కనబెట్టి, ప్రత్యర్థుల నకిలీ వ్యూహాలను తిప్పికొడుతూ ప్రభుత్వ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంపైనే కూటమి సోషల్ సైన్యాలు దృష్టి సారించాల్సి ఉంది.

# విజయసాయిపార్టీ లీకుల వ్యూహం ఏమిటో



నెల్లూరు, : వైఎస్సార్‌సీపీలో ఒకప్పుడు నంబర్–2గా చక్రం తిప్పి, ఆ తర్వాత రాజకీయ సన్యాసం ప్రకటించిన మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి మళ్లీ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారారు. వైఎస్సార్‌సీపీ అధికారం కోల్పోయిన అనంతరం తన పదవికి, పార్టీకి రాజీనామా చేసి వ్యవసాయం చేసుకుంటాను అని చెప్పిన ఆయన, ఇప్పుడు సడన్‌గా కొత్త పొలిటికల్ ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన తొలినాళ్లలో విజయసాయిరెడ్డి బీజేపీ గూటికి చేరుతారని విస్తృత ప్రచారం జరిగింది. ఢిల్లీ స్థాయిలో ఆయనకున్న పరిచయాలు, కేంద్ర పెద్దలతో ఉన్న సంబంధాల దృష్ట్యా కమలం తీర్థం పుచ్చుకుంటారని భావించారు. అయితే, ఏపీలో టీడీపీ–బీజేపీ–జనసేన కూటమి అధికారంలో ఉంది. విజయసాయిరెడ్డిని పార్టీలోకి తీసుకుంటే టీడీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందనే భావనతో పాటు, కూటమి ధర్మాన్ని పాటించేందుకు కేంద్ర బీజేపీ నాయకత్వం ఆయన చేరికపై సుముఖత చూపలేదని సమాచారం. బీజేపీ తలకదనం లేకపోవడంతో, అలాగే ఇతర జాతీయ పార్టీల వైపు వెళ్లే అవకాశం లేకపోవడంతో ఆయనకు సొంత బాట పట్టడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేకుండా పోయింది. కొన్ని రోజులుగా ఆయన తిరిగి పాతగూటికి వెళ్తారని ప్రచారం జరుగుతున్నా అది దాదాపు అసాధ్యమని అంటున్నారు. వైఎస్సార్‌సీపీలో అంతర్గతంగా పెరిగిన విభేదాలు, కోటరీతో విభేదించి బయటకు రావడం, ఆ తర్వాత ఆ పార్టీ అధినాయకత్వాన్ని ఉద్దేశించి సోషల్ మీడియా ద్వారా విమర్శనాత్మక పోస్టులు పెట్టడం వల్ల జగన్‌తో ఆయనకు గ్యాప్ పెరిగింది. ఎన్నికల ఓటమి తర్వాత జగన్ కూడా విజయసాయిరెడ్డి వ్యాఖ్యల పట్ల అసంతృప్తిగా ఉన్నారని, ఆయనను తిరిగి చేర్చుకోవడానికి జగన్ సిద్ధంగా లేరనే అభిప్రాయం వినిపించడంతో విజయసాయిరెడ్డి పూర్తిగా వైఎస్సార్‌సీపీ అధ్యాయానికి స్వస్తి చెప్పారని భావించవచ్చు.ఈ పరిణామాలతో విజయసాయిరెడ్డి భారత్ జన వికాస్ పేరుతో సరికొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుకు ముహూర్తం ఖరారు చేసుకుంటున్నట్లు లీకులు బయటకు వచ్చాయి. శ్రావణ మాసం ముగిసేలోపు పార్టీ ప్రకటన ఉండే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. మహిళలు, రైతులు, యువత, సమగ్ర రాష్ట్రాభివృద్ధే ఎజెండాగా ప్రాంతాల వారీగా సభలు నిర్వహించాలని ఆయన యోచిస్తున్నారు. అయితే ఈ పార్టీ వెనుక మరికొందరు ముఖ్యుల ఆశీస్సులు ఉన్నాయా? లేదా ఇతర రాజకీయ శక్తులు తెరవెనుక ఉండి నడిపిస్తున్నాయా? అనే సందేహాలు కూడా రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాజకీయ క్షేత్రం ప్రస్తుతం టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి , వైఎస్సార్‌సీపీల మధ్య ముఖాముఖి పోరుగా ఉంది. ఈ బైపోలార్ పొలిటికల్ వాతావరణంలో మూడో శక్తిగా నిలబడటం లేదా సొంత పార్టీతో ప్రభావం చూపడం అత్యంత సంక్లిష్టమైన అంశం. విజయసాయిరెడ్డికి మాస్ క్యాడర్ ఆధారిత ప్రజాదరణ లేకపోవడం, కేవలం ఆర్గనైజర్ , స్ట్రాటజిస్ట్‌గా మాత్రమే గుర్తింపు ఉండటం ప్రధాన పరిమితి. ఒకవేళ పార్టీ పెట్టినా, ఆయన సాధించే ఓటింగ్ శాతం కూటమికి లాభం చేకూరుస్తుందా లేక వైఎస్సార్‌సీపీ ఓట్ బ్యాంక్‌కే గండికొడుతుందా అనేది వేచి చూడాలి. భారీ ఆర్థిక వనరులు, బలమైన క్యాడర్ లేనిదే కొత్త పార్టీ నిలదొక్కుకోవడం కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# కూటమి సర్కార్‌కు 'కౌన్సిల్' గండం..



**విజయవాడ,** : తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన వైసీపీ శాసనసభాపక్ష సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో రాబోయే ఏపీ శాసనసభ, మండలి వర్షాకాల సమావేశాలపై పార్టీ శ్రేణులకు జగన్ దిశా నిర్దేశం చేశారు. ఈ క్రమంలో ఏపీ శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ అభ్యర్థిగా గుంటూరు జిల్లాకు చెందిన పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావును వైఎస్ జగన్ అధికారికంగా ఎంపిక చేశారు. అయితే, గత సమావేశాల మాదిరిగానే తమకు ప్రతిపక్ష హోదా ఇవ్వనందుకు నిరసనగా ఈసారి కూడా అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించాలని వైసీపీ ఎమ్మెల్యేలు నిర్ణయించుకున్నారు. కానీ, తమకు పూర్తి మెజారిటీ ఉన్న శాసనమండలి (కౌన్సిల్) సమావేశాలకు మాత్రం వైసీపీ ఎమ్మెల్సీలు అందరూ విధిగా హాజరుకావాలని పార్టీ అధిష్టానం స్పష్టం చేసింది. అసెంబ్లీకి దూరంగా ఉన్నప్పటికీ, శాసనమండలి వేదికగా అధికార చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు వైసీపీ పక్కా వ్యూహాలు రచిస్తోంది. పోయినసారి తిరుమల శ్రీవారి లడ్డు కల్తీ వ్యవహారంపై పెద్ద ఎత్తున రచ్చ చేసిన వైసీపీ, ఈసారి నిరుద్యోగుల సమస్యలను ప్రధాన అస్త్రంగా మార్చుకోనుంది. ముఖ్యంగా రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియలో జరిగినట్లు చెప్తున్న అవకతవకలు, మరియు అభ్యర్థుల ఆందోళనలను మండలిలో బలంగా వినిపించాలని వైసీపీ భావిస్తోంది. మెగా డీఎస్సీ అభ్యర్థులకు జరిగిన అన్యాయంపై కూటమి ప్రభుత్వాన్ని నిలదీయడం ద్వారా నిరుద్యోగుల పక్షాన నిలబడాలని వైఎస్ జగన్ తన ఎమ్మెల్సీలకు సూచించారు. ఆగస్టు 17 నుంచి ఏపీ శాసనసభ, మండలి సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో రాజకీయ వాతావరణం అప్పుడే వేడెక్కింది. కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో సులభంగా బిల్లులను ఆమోదింపజేసుకున్నప్పటికీ, శాసనమండలిలో మాత్రం వైసీపీకి మెజారిటీ ఉండటంతో ప్రభుత్వం ప్రవేశపెట్టే బిల్లులను అడ్డుకునే అవకాశం ఉంది. ఒకవైపు గత ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్–1 అక్రమాలపై సిట్ తుది నివేదికతో కూటమి సర్కార్ వైఎస్సార్సీపీని కట్టడి చేయాలని చూస్తుండగా, మరోవైపు కల్తీ లడ్డు, డీఎస్సీ వ్యవహారాలను అడ్డం పెట్టుకుని శాసనమండలి వేదికగా ప్రభుత్వాన్ని ముప్పుతిప్పలు పెట్టేందుకు వైసీపీ సిద్ధమవుతోంది. దీంతో ఈ వర్షాకాల సమావేశాలలో మండలి వేదికగా ఇరుపక్షాల మధ్య తీవ్ర స్థాయిలోనే రాజకీయం నడవనుందని స్పష్టమవుతోంది.

# అమరావతి నగర నిర్మాణం మొట్టమొదటి సక్సెస్

**-సీడ్ యాక్సెస్ రహదారి, స్టీల్ బ్రిడ్జిల ప్రారంభోత్సవంలో సీఎం చంద్రబాబు నాయుడు**

అమరావతి : సీడ్ యాక్సెస్ రహదారి, స్టీల్ బ్రిడ్జిల ప్రారంభోత్సవం అనంతరం బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగించారు. రాష్ట్రాభివృద్ధి విజన్కు అమరావతి నగర నిర్మాణం మొట్టమొదటి సక్సెస్. తెలుగు జాతి గర్వపడేలా ఉమ్మడి రాష్ట్రంలో సైబరాబాద్ నిర్మాణం జరిగింది. విభజన తర్వాత ఈ ప్రాంతం నష్ట పోయింది. రాజధాని కూడా లేకుండా పోయింది. 25 పార్లమెంటు స్థానాల్లో మధ్యలో గుంటూరు జిల్లా ఉంది. అందుకే రాజధానిని ఇక్కడ పెట్టాలని సంకల్పించాం. విస్తృత చర్చల తర్వాత మాపై విశ్వాసంతో రైతులు రాజధాని నిర్మాణం కోసం ముందుకు వచ్చారని అన్నారు. రాష్ట్ర రాజధాని కోసం భూములు త్యాగం చేసిన రైతులందరికీ పాదాభివందనం చేస్తున్నాను. సింగపూర్ అమరావతి బృహత్ ప్రణాళికకు పూర్తిగా సహకరించింది. అలాంటి సింగపూర్ను గత పాలకులు వేధింపులకు గురిచేశారు. ప్రభుత్వ కాంప్లెక్స్ భవనాలను యూనీక్గా ఉండాలని లండన్కు చెందిన నార్మన్ ఫాస్టర్స్ డిజైన్లు చేయించాం. కొందరు గ్రాఫిక్స్ అంటూ ఎగతాళి చేశారు. ఆ గ్రాఫిక్స్ నిజం అవుతుంటే ఎగతాళి చేసిన వాళ్లంతా తల దించుకోవాలి. అమరావతితో పాటు అన్ని ప్రాంతాలకూ అభివృద్ధి వికేంద్రీకరించేలా ప్రణాళికలు చేశాం. అసెంబ్లీలో రాజధాని నిర్మాణానికి 40 వేల ఎకరాలు కావాలన్న వ్యక్తి



తర్వాత మూడు రాజధానులు అని మాటతిప్పేశాడు. 2019–24 మధ్య రైతుల ఉద్యమాన్ని చరిత్ర మర్చిపోదు. ఆ ఉద్యమానికి మేం కూడా జోలె పట్టి రైతులకు సహకరించాం. అమరావతి రాజధాని నిర్మాణానికి దేశంలోని పవిత్ర నదులు, ప్రాంతాల ఆశీర్వాదం కోసం నీరు, మట్టిని తెప్పించి ఇక్కడ కలిపాం. తిరుమల తర్వాత అంతటి విశిష్టమైన శ్రీవారి ఆలయం అమరావతిలో ఉండాలని ఆకాంక్షించాను. అమరావతితో పాటు రాష్ట్రం అంతటా అభివృద్ధి కావాలన్నదే నా ఆకాంక్ష. హెల్తీ వెల్తీ హ్యాపీ ఏపీ కావాలన్నదే నా ఆకాంక్ష. అమరావతిని ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దుతున్నామని అన్నారు.

# మహాకుంభమేళ తరహాలో గోదావరి పుష్కరాలు

**రాజమండ్రి,** : ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళా తరహాలో, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, అత్యున్నత వసతులతో 2027 గోదావరి పుష్కరాలను నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం సన్నాహాలు ముమ్మరం చేసింది. దక్షిణాది మహా కుంభమేళాగా భావించే ఈ పుష్కరాలకు కోట్ల సంఖ్యలో తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, గ్లోబల్ స్టాండర్డ్స్‌కు తగినట్లు ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మహాక్రతువు కోసం మొత్తం అంచనా వ్యయం రూ.8,500 కోట్లుగా నిర్ధారించగా.. తొలి విడత మౌలిక వసతులు, ఘాట్ల విస్తరణ పనుల నిమిత్తం ప్రభుత్వం ఇప్పటివరకు రూ.530 కోట్లను అధికారికంగా మంజూరు చేసింది. పుష్కరాల నిర్వహణలో అత్యంత కీలకమైన శాఖలకు నిధుల కేటాయింపులను ప్రభుత్వం పక్కాగా వర్గీకరించింది. గోదావరి తీరంలో భక్తుల రద్దీని తట్టుకునేలా 238 పాత , కొత్త పుష్కర ఘాట్ల ఆధునీకరణ, మరమ్మతులు, నిర్మాణాలు చేపడుతున్న నీటిపారుదల శాఖకు అత్యధికంగా రూ.210.06 కోట్లు కేటాయించారు. పట్టణ మౌలిక వసతులు, పారిశుధ్య నిర్వహణ పనుల నిమిత్తం పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు రూ.150 కోట్లు విడుదల కాగా, గోదావరి తీరమంతటా నిరంతర విద్యుత్ సరఫరా, తాత్కాలిక సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ఇంధన శాఖకు రూ.100 కోట్లు కేటాయించారు. దీంతో పాటు ఆలయాల సుందరీకరణ, ధార్మిక కార్యక్రమాల నిర్వహణకు దేవాదాయ శాఖకు రూ.60 కోట్లు, టూరిజం సేవలు, సాంస్కృతిక ప్రదర్శనల విస్తరణకు పర్యాటక, సాంస్కృతిక శాఖకు రూ.10 కోట్లు నిధులు విడుదలయ్యాయి. ఈసారి పుష్కరాలలో డిజిటల్ టెక్నాలజీ వినియోగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. లక్షలాది మంది భక్తులు ఒకేసారి వచ్చే అవకాశం ఉన్నందున క్రౌడ్ మేనేజ్‌మెంట్ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత సీసీటీవీ నెట్‌వర్క్, డ్రోన్ సర్వైలెన్స్, రియల్




టైమ్ కంట్రోల్ రూమ్‌లను అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. భక్తులు తాము స్నానం చేయాలనుకునే ఘాట్లు, స్లాట్ బుకింగ్, ట్రాఫిక్ రూట్ మ్యాప్స్, అందుబాటులో ఉన్న పార్కింగ్ స్థలాలు, అత్యవసర వైద్య సేవల సమాచారాన్ని సులువుగా తెలుసుకునేలా ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌ను, క్యూఆర్ కోడ్ నేవిగేషన్ సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. నది తీరం పొడవునా పారిశుధ్యం, భద్రత , పర్యావరణ పరిరక్షణ విషయాలలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. నది నీరు కలుషితం కాకుండా ప్రత్యేక ఫిల్ట్రేషన్ గ్రిడ్లను ఏర్పాటు చేయడమే కాక, ప్లాస్టిక్ రహిత పుష్కరాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నారు. ప్రతి ఘాట్ వద్ద 24 గంటలు అందుబాటులో ఉండేలా మొబైల్ మెడికల్ టీమ్‌లు, అంబులెన్సులు, పారిశుధ్య సిబ్బంది , స్విమ్మింగ్ నిపుణులను అందుబాటులో ఉంచనున్నారు. భక్తుల రద్దీని నియంత్రించేందుకు కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు వేగంగా పనిచేస్తాయి. రాజమండ్రి, కోవూరు, నరసాపురం, భద్రాచలం పరిసర ప్రాంతాల గోదావరి తీరాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్ది, పుష్కరాలకు వచ్చే కోట్లాది మంది భక్తులకు భక్తిపారవశ్యంతో పాటు అధునాతనమైన, సురక్షితమైన ఆధ్యాత్మిక అనుభూతిని అందించడమే లక్ష్యంగా వైభవంగా ఏర్పాట్లు వేగవంతమవుతున్నాయి.

# మండలి కోసం వడపోతలు షురూ

విజయవాడ, : ఆంధ్రప్రదేశ్ శాసన మండలి లో గవర్నర్ కోటాకు చెందిన రెండు సభ్యుల పదవీకాలం ముగియడంతో కొత్త నియామకాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది. ఇప్పటివరకు ఈ స్థానాల్లో కొనసాగిన పందుల రవీంద్ర , జకియా ఖానం పదవీకాలం ముగియడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ ( ఈ రెండు స్థానాలను భర్తీ చేసే అవకాశం ఉండటంతో పలువురు నేతలు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాల కోసం పార్టీలోనే తీవ్ర పోటీ నెలకొన్నట్లు తెలుస్తోంది. గత ఎన్నికల్లో టికెట్ దక్కని నాయకులు, పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులు, పార్టీ కోసం త్యాగం చేసిన వారు, సామాజిక సమీకరణాల్లో కీలక పాత్ర పోషించే నేతలు తమ పేర్లను పరిశీలించాలని అధిష్ఠానాన్ని కోరుతున్నట్లు సమాచారం. సామాజిక వర్గాల సమతుల్యతను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకునే అవకాశముందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. మిత్రపక్షాలకు ఈ స్థానాలను కేటాయించకుండా రెండింటినీ టీడీపీనే భర్తీ చేస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికే సంకేతాలు ఇచ్చినట్లు రాజకీయ చర్చ సాగుతోంది. దీంతో పార్టీ అంతర్గతంగా పోటీ మరింత పెరిగింది. ఎవరికీ అవకాశం దక్కుతుందన్న అంశంపై నాయకుల్లో ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం అసెంబ్లీలో టీడీపీకి స్పష్టమైన మెజారిటీ ఉంది. దీంతో ప్రభుత్వానికి అవసరమైన బిల్లులు సులభంగా ఆమోదం పొందుతున్నాయి. అయితే శాసన మండలిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. అక్కడ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ప్రభుత్వానికి ప్రతి అంశంలో సవాళ్లు ఎదురవుతున్నాయి. కొన్ని కీలక బిల్లులపై మండలిలో తీవ్ర చర్చలు జరగడంతో పాటు ప్రభుత్వానికి ఆశించిన ఫలితాలు రాకపోయిన సందర్భాలు కూడా ఉన్నాయిఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొన్ని కీలక బిల్లులు శాసన మండలిలో ఆశించిన విధంగా ఆమోదం పొందలేదు. పార్టీ నేత తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించే ప్రతిపాదనతో తీసుకొచ్చిన బిల్లు మండలిలో నిలిచిపోయింది. అలాగే పీపీపీ విధానంలో కొన్ని మెడికల్ కాలేజీల నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించే అంశం కూడా తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ పరిణామాలు మండలిలో ప్రభుత్వ వాదనను మరింత బలంగా వినిపించే నాయకుల అవసరాన్ని టీడీపీ ముందుకు తెచ్చాయి. అందుకే సభలో దూకుడుగా వాదించే, ప్రతిపక్ష విమర్శలకు సమర్థంగా సమాధానం చెప్పగల నాయకులను ముందుకు తీసుకురావాలనే ఆలోచనకు పార్టీ ప్రాధాన్యం ఇస్తోందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఈ వ్యూహంలో భాగంగానే శ్రీకాకుళం (కు చెందిన కావలి గ్రీష్మకు అవకాశం కల్పించారు.

# ఐఎన్ఎస్ డేగ ఇక జ్ఞాపకమేనా



విశాఖపట్టణం, : ఆరు దశాబ్దాలకు పైగా విశాఖపట్నానికి విమానంలో వచ్చిన ప్రతి ప్రయాణికుడూ సాధారణ విమానాశ్రయంలో దిగలేదు... భారత నౌకాదళ వైమానిక స్థావరంలోనే అడుగుపెట్టాడు. మీా విమానం ల్యాండ్ అయిన అదే రన్‌వేపై ప్రతి ఉదయం హాక్ జెట్ శిక్షణ విమానాలు గర్జిస్తూ ఆకాశంలోకి దూసుకెళ్లేవి. టెర్మినల్ పక్కనే జలాంతర్గాములను వేటాడే హెలికాప్టర్లు నిలిపిన హ్యాంగర్లు కనిపించేవి. పౌర విమానాలు, యుద్ధ విమానాలు... రెండూ ఒకే రన్‌వేను పంచుకోవడం విశాఖకు మాత్రమే ప్రత్యేకమైన దృశ్యం. "విశాఖ అంటే అంతే" అన్నట్టే వైజాగ్ ఎయిర్పోర్ట్ ఆపరేషన్స్ సాగాయి. ఆగస్టు 1, 2026న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భోగాపురంలోని "అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని" ప్రారంభించారు. ఆగస్టు 17నుంచి అన్ని కమర్షియల్ విమాన సర్వీసులు అక్కడికి మారనున్నాయి. దీంతో ఆరు దశాబ్దాలుగా ప్రయాణికులను ఆహ్వానించిన ఐఎన్ఎస్ డేగా ఇకపై పూర్తిగా నావికాదళ విమాన స్థావరంగానే కొనసాగనుంది. ఈ సందర్భంగా ఒక ప్రశ్న సహజంగానే వస్తుంది. ఐఎన్ఎస్ డేగా కథ ఎక్కడ మొదలైంది? ఇప్పుడు దాని భవిష్యత్తు ఎలా ఉండబోతోంది? యుద్ధ అవసరాల కోసం నిర్మించిన రన్‌వే... తర్వాత నౌకాదళ గూటిగా మారింది ఎఔా డేగా చరిత్ర భారత నౌకాదళంతో కాదు... రెండో ప్రపంచ యుద్ధంతో ప్రారంభమవుతుంది. ఆ సమయంలో భారత తూర్పు తీరంలో సైనిక కార్యకలాపాలకు మద్దతుగా రాయల్ ఎయిర్ ఫోర్స్ నావల్ ఆర్మమెంట్ డిపో సమీపంలో ఒక ఎయిర్‌స్ట్రిప్ నిర్మించింది. యుద్ధం ముగిసిన తర్వాత ఆ రన్‌వే దాదాపు నిరుపయోగంగా మారిపోయింది. 1962లో పౌర విమానాల కోసం మళ్లీ తెరిచినా ప్రయాణికుల సంఖ్య తక్కువగా ఉండటంతో సేవలు పలుమార్లు నిలిచిపోయాయి. భారత నౌకాదళం తన వైమానిక విభాగాన్ని విస్తరించే క్రమంలో 1972 డిసెంబరులో విశాఖలో కార్యకలాపాలు ప్రారంభించింది. తొలుత ఎఔా సర్కార్స్ నుంచి హెలికాప్టర్ యూనిట్‌ను నడిపింది. నాలుగేళ్లలో పౌర విమానాశ్రయం పక్కనే హెలిప్యాడ్లు, హ్యాంగర్లు ఏర్పడ్డాయి. 1986లో ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా విశాఖ విమానాశ్రయాన్ని అధికారికంగా భారత నౌకాదళానికి అప్పగించింది. భారత పౌర విమానయాన చరిత్రలో ఇది అత్యంత అరుదైన నమూనా. సాధారణంగా సైనిక స్థావరాల్లో పౌర విమానాల కోసం చిన్న ఎన్‌క్లేవ్ ఉంటుంది. విశాఖలో మాత్రం పూర్తిస్థాయి పౌర విమానాశ్రయం నావికాదళ స్థావరం లోపలే నడిచింది. 1991 అక్టోబర్ 21న వైస్ అడ్మిరల్ లక్ష్మీనారాయణ రామ్‌దాస్ దీనిని అధికారికంగా "ఐఎన్ఎస్ డేగా" గా ప్రారంభించారు. డేగా" అంటే మనకు తెలిసిన గద్ద జాతి పక్షే. శక్తి, వేగానికి ప్రతీకగా నిలిచే ఆ పేరు... తర్వాతి కాలంలో హాక్ జెట్లు, కామోవ్ హెలికాప్టర్లు, నిఘా విమానాలకు కేంద్రంగా ఎదిగి ఈ స్థావరానికి సరిగ్గా సరిపోయింది. 2000ల దశకం ఐఎన్ఎస్ డేగా రూపురేఖలనే మార్చేసింది. 2007లో 10 వేల అడుగుల కొత్త రన్‌వే అందుబాటులోకి వచ్చింది. వెంటనే రాత్రి వేళల్లో కూడా విమాన కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. గోవా నుంచి కామోవ్ హెలికాప్టర్లతో కూడిన ఐఎన్ఏఎస్-333 "ఈగిల్స్", తర్వాత హాక్ జెట్ శిక్షణ విమానాలతో ఎఔయా-551 "ది ఫాంటమ్స్" ఇక్కడికి వచ్చాయి. 2009 నాటికి ఐదు నౌకాదళ స్క్వాడ్రన్లు, యుద్ధ నౌకల విమాన యూనిట్లు, నెలకు 550కుపైగా కమర్షియల్ విమానాలు... అన్నీ ఒకే రన్‌వేను పంచుకునే స్థాయికి ఐఎన్ఎస్ డేగా చేరుకుంది. విశాఖ ప్రజలకు ఇది రోజువారీ జీవితంలో భాగమైపోయింది. పైన హాక్ జెట్ గర్జిస్తే అది సాధారణ దృశ్యమే. కానీ ఎఔా డేగా కేవలం విమానాశ్రయం మాత్రమే కాదు. ప్రతి ఏడాది బంగాళాఖాతంలో విరుచుకుపడే తుపాన్లు, వరదల సమయంలో సహాయక చర్యల్లో ముందుండేది. తూర్పు నౌకాదళ కమాండ్ అడ్వెంచర్, స్కైడైవింగ్ కార్యక్రమాలకు కూడా ఇదే కేంద్రంగా నిలిచింది. ఈ ద్వంద్వ వినియోగ వ్యవస్థ విశాఖకు ప్రత్యేక గుర్తింపునిచ్చింది. అయితే అదే కాలక్రమంలో దాని బలహీనతగా కూడా మారింది. మూడు వైపులా కొండలు ఉండటంతో విమానాలు ఒకే దిశలో టేకాఫ్, ల్యాండింగ్ చేయాల్సి వచ్చేది. గంటకు దాదాపు పది విమానాలకే పరిమితి. అదీ కాక పౌర విమానాల షెడ్యూల్ మొత్తం నౌకాదళ శిక్షణ సమయాలకు అనుగుణంగానే ఉండేది. ఇంతలో విశాఖ నగరం విస్తరించింది. ఉక్కు పరిశ్రమలు, ఫార్మా కంపెనీలు, పోర్టు ఆధారిత పెట్టుబడులతో దేశంలో వేగంగా ఎదుగుతున్న నగరంగా మారింది. 1990ల అవసరాలకు సరిపోయే విమానాశ్రయం... 2020ల విశాఖ అవసరాలకు సరిపోలేని పరిస్థితి ఏర్పడింది. ఎన్నో సంవత్సరాలుగా ప్రతిపాదనలకే పరిమితమైన భోగాపురం విమానాశ్రయం చివరకు సాకారమైంది. సుమారు ?4,700 నుంచి ?5,600 కోట్ల వ్యయంతో పీపీపీ విధానంలో జీఎంఆర్ నిర్మించిన "అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం", విశాఖకు ఈశాన్యంగా విజయనగరం జిల్లా భోగాపురం సమీపంలో సిద్ధమైంది. 3,800 మీటర్ల రన్‌వేతో భారీ వైడ్‌బాడీ విమానాలు దిగే సామర్థ్యం దీనికి ఉంది. మొదటి దశలో ఏడాదికి 60 లక్షల మంది ప్రయాణికులను నిర్వహించేలా, భవిష్యత్తులో నాలుగు కోట్ల వరకు విస్తరించేలా దీన్ని రూపకల్పన చేశారు. డీజీసీఏ లైసెన్స్, బీసీఏఎస్ భద్రతా అనుమతులు, అంతర్జాతీయ ఇమ్మిగ్రేషన్ హోదా... అన్నీ పూర్తయ్యాయి. ఆగస్టు 17 నుంచి దేశీయ, అంతర్జాతీయ కమర్షియల్ విమానాలన్నీ భోగాపురం నుంచే నడవనున్నాయి. విశాఖకు చిరునామాగా ఉన్న"ఋజి" ఐఏటీఏ కోడ్ కూడా అక్కడికే మారుతుంది. ఈ మార్పుతో మూతపడేది పౌర ప్రయాణికుల టెర్మినల్ మాత్రమే. నావికాదళ స్థావరం మాత్రం యథావిధిగా కొనసాగుతుంది. సైనిక విమానాలు, నౌకాదళ కార్యకలాపాలు, విపత్తు సహాయక చర్యలు, ప్రభుత్వ ప్రత్యేక విమానాలు, వీఐపీ రాకపోకలు... అన్నింటికీ ఐఎన్ఎస్ డేగా సేవలందిస్తూనే ఉంటుంది. అంతేకాదు, కమర్షియల్ విమానాల ఒత్తిడి తొలగిపోవడంతో విశాఖ గగనతలంపై భారత నౌకాదళానికి పూర్తి నియంత్రణ లభిస్తుంది. ఇప్పటి వరకు పౌర విమానాల షెడ్యూల్‌ను దృష్టిలో పెట్టుకుని చేయాల్సి వచ్చిన అడ్జస్ట్మెంట్లు ఇక అవసరం ఉండవు. శిక్షణ విమానాలు పెంచడం, నౌకాదళ కార్యకలాపాలను విస్తరించడం, అత్యవసర పరిస్థితుల్లో మరింత వేగంగా స్పందించడం... ఇవన్నీ మరింత సులభమవుతాయి. ఐఎన్ఎస్ డేగా ఎప్పుడూ శాశ్వత పౌర విమానాశ్రయంగా లేదు. భౌగోళిక పరిస్థితులు, కాలానుగుణ అవసరాలు కలిసి తాత్కాలిక ఏర్పాటుగా మొదలైన వ్యవస్థ... మూడు దశాబ్దాలకు పైగా విశాఖ నగరానికి సేవలందించింది. దాని వల్ల విశాఖ దేశవ్యాప్తంగా మెరుగైన వైమానిక అనుసంధానం పొందింది. అదే సమయంలో పరిమిత సామర్థ్యం, యుద్ధ విమానాలతో రన్‌వే పంచుకోవాల్సిన పరిస్థితిని కూడా భరించింది. ఇప్పుడు ఆ రెండు పాత్రలు విడిపోతున్నాయి. విశాఖకు ప్రపంచస్థాయి అంతర్జాతీయ విమానాశ్రయం లభిస్తోంది. ఐఎన్ఎస్ డేగా మాత్రం తన అసలు స్వరూపానికి తిరిగి వెళ్తోంది... తూర్పు నౌకాదళానికి పూర్తిస్థాయి వైమానిక కేంద్రంగా. ఇకపై ఆ పాత రన్‌వేపై హాక్ జెట్ గర్జిస్తూ ఆకాశంలోకి ఎగిరినప్పుడు... దాని వెనుక టేకాఫ్ కోసం బోయింగ్-737 విమానాల వరుస కనిపించదు అంతే

# జెన్ జీ టచ్ లో జనసేన




**కాకినాడ, ఆగస్టు 6 :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో జనసేన పార్టీని మరింత బలోపేతం చేసేందుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా జెన్ జీ యువత కేంద్రంగా రాజకీయ పరిస్థితులు మారుతున్నాయి. ఈ నేపథ్యంలో జనసేన పార్టీని సైతం అదే ఆధునిక స్థాయిలో తీర్చిదిద్దాలని పవన్ గట్టిగా భావిస్తున్నారు. కేవలం పాత పద్ధతుల్లో కాకుండా మారుతున్న టెక్నాలజీ, సోషల్ మీడియా, సరికొత్త ఆలోచన విధానాలకు అనుగుణంగా పార్టీ యంత్రాంగాన్ని మార్పులు చేస్తున్నారు. ఇందులో భాగంగానే రాష్ట్ర అధికార ప్రతినిధుల కమిటీని రద్దు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 26 మంది నాయకులను వారి బాధ్యతల నుంచి తప్పించారు. నూతన నియామకాలు పూర్తి అయ్యే వరకు టీవీ డిబేట్లు, మీడియా సమావేశాలలో ఎవరూ పాల్గొనవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పార్టీ సంస్థాగత ప్రక్షాళన దిశగా ఈ నిర్ణయం చాలా కీలకమైన అడుగుగా రాజకీయ వర్గాలలో చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి కావస్తున్న తరుణంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈ సమూల మార్పులు చేపడుతున్నారు. ఇప్పటికే ప్రకాశం అలాగే నెల్లూరు జిల్లాల కమిటీలను రద్దు చేసిన అధినాయకత్వం, పార్లమెంటరీ నియోజకవర్గాల వారీగా కొత్త కమిటీల బాధ్యతలను క్షేత్రస్థాయి క్యాడర్ కు అప్పగిస్తోంది. ఈ వరుస నిర్ణయాల కొనసాగింపుగానే ఇప్పుడు రాష్ట్రస్థాయి అధికార ప్రతినిధుల కమిటీని పూర్తిగా రద్దు చేయడం జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాలలో జనసేనకు ప్రాతినిధ్యం వహిస్తున్న 26 మంది అధికార ప్రతినిధుల బాధ్యతలను హైకమాండ్ ఉపసంహరించుకుంది. కొత్త కమిటీల నియామకం జరిగే వరకు మీడియా ముందుకు వచ్చి మాట్లాడకూడదని కఠిన నిబంధనలు పెట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల సమయానికి పార్టీని పూర్తి స్థాయిలో సన్నద్ధం చేయడమే ఈ ప్రక్షాళన ముఖ్య ఉద్దేశం. క్షేత్రస్థాయి నుంచి నాయకులను చురుగ్గా ఉంచడానికి ఈ కఠినమైన నిర్ణయాలు ఎంతగానో ఉపయోగపడతాయని పార్టీ భావిస్తోంది. జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి యువతకు ఎప్పుడూ పెద్దపీట వేస్తూ వస్తున్నారు పవన్ కళ్యాణ్. అయితే ప్రస్తుత జెన్ జీ ట్రెండ్‌కి తగినట్లుగా పోరాటాలకు సిద్ధంగా ఉండే నాయకత్వాన్ని తయారు చేయాలని కోరుకుంటున్నారు. కొత్త తరపు గొంతుక పార్టీలో స్పష్టంగా వినిపించాలనే లక్ష్యంతో ఈసారి మరింత ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పూర్తిగా ప్రక్షాళన చేసే పనిలో పడ్డ ఆయన కొత్త కమిటీల నియామకం పై సుదీర్ఘంగా కసరత్తు చేస్తున్నారు. ఈసారి కేవలం రాజకీయ నాయకులే కాకుండా చదువుకున్న విద్యాధికులతో పాటు ఐటీ ఉద్యోగులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తున్నారు. అన్ని సామాజిక వర్గాల వారికి తగిన స్థానం కల్పించడం ద్వారా ప్రజల్లోకి బలమైన సంకేతాలు పంపాలని చూస్తున్నారు. వచ్చే నెలలో ఈ కొత్త కమిటీల పూర్తి జాబితాను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. యువత శక్తిని పూర్తిగా వినియోగించుకోవడం ద్వారా పార్టీ భవిష్యత్తును మరింత పటిష్టం చేయాలనే లక్ష్యంతో అడుగులు పడుతున్నాయి. దేశ రాజకీయాలను ఇటీవల కాలంలో జెన్ జీ తరహా ఉద్యమాలు ఒక కుదుపు కుదిపేశాయి. ఆ స్ఫూర్తిని దృష్టిలో ఉంచుకుని జనసేన పార్టీలో యువతతో పాటు చదువుకున్న టెక్కీలకు అత్యధిక ప్రాధాన్యం కల్పించాలని సమాచారం అందుతోంది. ముఖ్యంగా ఐటీ రంగానికి చెందిన నిపుణులు, సామాజిక అంశాలపై పూర్తి అవగాహన ఉన్న యువ నాయకులను ప్రోత్సహించి కీలక బాధ్యతలు అప్పగించాలని ఆలోచిస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలకు సమ ప్రాధాన్యం ఇస్తూ సామాజిక సమీకరణాలను సమతుల్యం చేయడమే ఈ కొత్త కమిటీల ప్రత్యేకతగా నిలవనుంది. కేవలం సాంప్రదాయ ధోరణులకు పరిమితం కాకుండా నేటి డిజిటల్ యువతకు సులభంగా అర్థమయ్యే రీతిలో పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పవన్ కళ్యాణ్ కోరుకుంటున్నారు. ఈ ఆధునిక విధానం ద్వారా యువత పెద్ద ఎత్తున పార్టీ వైపు ఆకర్షితులు అవుతారని, రాబోయే ఎన్నికలలో ఇది పార్టీ విజయానికి ప్రధాన భూమిక పోషిస్తుందని అంతా భావిస్తున్నారు. మార్పు అనేది ఎప్పుడూ ఒక మంచి పరిణామం అని నమ్మే పవన్ కళ్యాణ్, జనసేన పార్టీలో చేస్తున్న ఈ ప్రక్షాళన భవిష్యత్తు రాజకీయాలకు ఒక దిక్సూచి కానుంది. టెక్నాలజీ యుగంలో దూసుకుపోతున్న నేటి తరానికి తగినట్లుగా పార్టీ యంత్రాంగాన్ని సంస్కరించడం ద్వారా సమాజంలో సరికొత్త రాజకీయ సంస్కృతికి నాంది పలుకుతున్నారు. అనుభవజ్ఞులైన సీనియర్ల మార్గదర్శకత్వంలోనే ఉంటూనే, నిర్ణయాలు తీసుకునే అధికారంలో యువతకు పెద్దపీట వేయడం ఈ కొత్త కమిటీల ప్రధాన ఉద్దేశం.

# గుడివాడలోకి కొడాలి ఎంట్రీ



విజయవాడ, : మాజీ మంత్రి కొడాలని రాజకీయాల్లో మళ్లీ క్రియాశీలకం అయ్యారు. వైసీపీ అధినేతను కలవడం, ప్రభుత్వాన్ని విమర్శించడం వంటి పరిణామాలతో ఆయన గుడివాడ రాజకీయాల్లో తిరిగి యాక్టివ్ మోడ్‌లోకి వచ్చారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లిలో ఇటీవల కలిసి పార్టీ బలోపేతంపై చర్చించారు. కూటమి ప్రభుత్వంపై, ముఖ్యంగా చంద్రబాబు పాలనపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. గుడివాడ రాజకీయాల్లో మళ్లీ తన మార్క్ పోరాటాలకు సిద్ధమవుతున్నారు. గుడివాడలోవరసగా గెలిచిన కొడాలి నాని గత ఎన్నికల్లో కూటమి గాలిలో ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత ఆయన ఆరోగ్యం బాగా లేక హైదరాబాద్ కే పరిమితమయ్యారు. కొడాలి నాని పై అనేక కేసులు నమోదయ్యాయి. అప్పుడప్పుడు గుడివాడకు రావడం పోలీసు స్టేషన్ కు వచ్చి హాజరు కావడం తిరిగి హైదరాబాద్ వెళ్లిపోతున్నారు. అలాంటి కొడాలి నాని తిరిగి గుడివాడలో వైసీపీ బలోపేతానికి ఆయన సిద్ధమయ్యారని తెలిసింది. మొన్నా మధ్య కొడాలి నాని తన రాజకీయ వారసుడిగా తన సోదరుడి కుమారుడిని ప్రకటించారు. తన రాజకీయ వారసుడిగా తన తమ్ముడి కుమారుడైన కొడాలి అర్జున్ పేరును ప్రకటించారు. నానికి ఇద్దరు కుమార్తెలు ఉండగా, వారికి రాజకీయాలపై ఆసక్తి లేకపోవడంతో సోదరుడి కుమారుడిని వారసుడిగా ఎంపిక చేశారు. రాజకొడాలి అర్జున్ 2029 ఎన్నికల్లో కొడాలి నాని స్వయంగా గుడివాడ బరిలో నిలవనుండగా, ఆ తర్వాత 2034 ఎన్నికల్లో అర్జున్ రాజకీయ రంగప్రవేశం చేస్తారని స్పష్టమైందిస్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండగా కొడాలి నాని మళ్లీ యాక్టివ్ అయ్యారు. కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కలసి పనిచేయాలని సూచించారు. కేసులు పెట్టి జైల్లో వేస్తే నెల లేదా ఆరు నెలలు ఉంటామని, తర్వాత బయటకు వస్తామని కొడాలి నాని అన్నారు. అంతే కాదు స్థానికసంస్థల ఎన్నికల్లో గుడివాడ నియోజకవర్గంలో ఎక్కడా ఏకగ్రీవం కానివ్వబోమని ప్రకటించారు. అన్ని స్థానాల్లో వైసీపీ అభ్యర్థులు పోటీ చేస్తారని కొడాలి నాని ప్రకటించారు. గుడివాడలో జరిగిన కార్యకర్తల సమావేశంలో కొడాలి నాని మాట్లాడుతూ తాను కూడా ఇక కార్యకర్తల చెంతనే ఉంటానని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని అన్నారు. కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిందని, ఇక వచ్చేది వైసీపీ ప్రభుత్వమేనని ఆయన చెప్పడంతో ఇక గుడివాడ అడ్డాగా కొడాలి నాని పనిచేస్తారని ఆయన అనుచరులు చెబుతున్నారు.

# నవంబర్ లో లోకల్ బాడీ ఎన్నికలు



**విజయవాడ,** : ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల వేడి మొదలైంది. రాబోయే నవంబర్ నాటికి లోకల్ పోల్స్ ముగించాలనే పక్కా ప్లాన్‌తో అధికార కూటమి అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇద్దరూ ఇప్పటికే తమ పార్టీల శ్రేణులకు ఈ విషయంలో స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. చట్టపరమైన, సాంకేతికపరమైన ప్రక్రియ పూర్తి కాగానే స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని, దానికి సైనికుల్లా సిద్ధం కావాలని క్షేత్రస్థాయి క్యాడర్‌ను అలర్ట్ చేశారు. ఎన్నికల ప్రకటన వచ్చిన తర్వాత సీట్ల కోసం కొట్టుకోకుండా, ముందే గ్రౌండ్ లెవెల్‌లో ఒక అవగాహనకు అంతర్గతంగా వచ్చేస్తున్నారు. గత ఎన్నికల్లో జనసేన పార్టీ వంద శాతం స్ట్రైక్ రేట్‌తో దూసుకుపోవడానికి ప్రధాన కారణం పార్టీ కోసం రక్తం చిందించిన క్షేత్రస్థాయి కార్యకర్తలే. అందుకే ఈసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో వారికి ప్రాధాన్యత ఇవ్వాలని పవన్ కళ్యాణ్ గట్టిగా నిశ్చయించుకున్నారు. గత ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ అరాచకాలను ఎదుర్కొని, పార్టీ జెండా మోసిన నిజమైన లాయల్ కార్యకర్తల పూర్తి సమాచారాన్ని, వారి అర్హతలను జనసేన అధిష్ఠానం ఇప్పటికే సేకరించింది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక పైరవీలు చేసేవారికి కాకుండా, కష్టపడ్డవారికే టికెట్లు దక్కుతాయి అనే నమ్మకాన్ని పవన్ కిందిస్థాయి క్యాడర్‌లో నింపారు. దీనివల్ల ఆశావహుల్లో గందరగోళం తగ్గి, పార్టీ కోసం మరింత ఉత్సాహంగా పనిచేసే వాతావరణం ఏర్పడింది. మరోవైపు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు స్థానిక సంస్థల ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఇటీవల కుప్పం, కర్నూలు తదితర ప్రాంతాల సమీక్షా సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. లోకల్ పోల్స్‌లో విజయం సాధించడం నాన్-నెగోషియబుల్ అని తేల్చిచెప్పారు. స్థానిక ఎన్నికల్లో గెలిపించిన నేతలనే పార్టీ నెత్తిన పెట్టుకుంటుందని, ఓడిపోయిన వారిని ఎంతటి వారైనా పక్కన పెడుతుందని కఠినమైన హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యంగా తంబళ్లపల్లె వంటి నియోజకవర్గాల్లో పార్టీ ఇన్‌చార్జ్‌ల నియామకం, గ్రౌండ్ ఫీడ్‌బ్యాక్ ఆధారంగానే సీట్ల కేటాయింపు ఉంటుందని లోకేష్, బాబు స్పష్టం చేయడంతో తమ్ముళ్లలో మునుపెన్నడూ లేని సీరియస్‌నెస్ కనిపిస్తోంది. సాధారణంగా స్థానిక ఎన్నికలు అనగానే అధికార పార్టీల్లో టికెట్ల కోసం అంతర్గత కుమ్ములాటలు, తిరుగుబాట్లు కామన్. పైగా ఇక్కడ టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి కూటమిగా పోటీ చేస్తున్నాయి. ఒకే స్థానానికి ముగ్గురు అభ్యర్థులు పోటీ పడితే ఓట్లు చీలిపోయే ప్రమాదం ఉంది. ఈ ముప్పును ముందే పసిగట్టిన బాబు-పవన్ ద్వయం.. క్షేత్రస్థాయిలో ఎలాంటి గందరగోళానికి తావులేకుండా సీట్ల సర్దుబాటు ఫార్ములాను ముందే సిద్ధం చేస్తున్నారు. ఏయే గ్రామ పంచాయతీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో ఏ పార్టీ బలంగా ఉందో ఆ పార్టీకే ఆ సీటు కేటాయించేలా.. జిల్లా స్థాయి మంత్రులు, ఇన్‌చార్జ్‌ల పర్యవేక్షణలో ముందస్తు స్క్రీనింగ్ కమిటీలు వేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల తరహాలోనే స్థానిక ఎన్నికల్లోనూ 2024 నాటి కూటమి పొత్తు సెంటిమెంట్‌ను అలాగే కొనసాగించాలని అధినాయకత్వం భావిస్తోంది. పైస్థాయిలో నేతలు కలిసి ఉన్నా, కిందిస్థాయిలో గ్రామాల్లో టీడీపీ-జనసేన క్యాడర్ కలవడం చాలా ముఖ్యం. అందుకోసమే ఉమ్మడి సమన్వయ కమిటీల ద్వారా ఇరు పార్టీల కార్యకర్తలను ఒకే తాటిపైకి తెస్తున్నారు. ఈ ముందస్తు సన్నాహాల వల్ల ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే సమయానికి కూటమి తరఫున అభ్యర్థులు దాదాపు ఖరారై ప్రచారంలో ఉంటారు. ఇది ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీని మానసికంగా మరింత డిఫెన్స్‌లోకి నెట్టేసే వ్యూహం. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ వరుస పరాజయాలు, అంతర్గత వలసలతో డీలా పడి ఉంది. ఈ తరుణంలో నవంబర్ లోకల్ బాడీ ఎన్నికల్లో కూడా కూటమి క్లీన్ స్వీప్ చేస్తే.. విపక్షం పుంజుకునే అవకాశాలు పూర్తిగా మూసుకుపోతాయి. అందుకే చంద్రబాబు కమాండర్‌లా తానే ముందుండి నడిపిస్తానని భరోసా ఇస్తుండగా, పవన్ కళ్యాణ్ పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా గ్రామీణ ఓటర్లను ఆకట్టుకునేలా సరికొత్త అభివృద్ధి సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. అభ్యర్థుల ఎంపికలో పారదర్శకత, ముందస్తు ప్రణాళిక, క్యాడర్‌కు స్పష్టమైన గైడ్‌లైన్స్.. ఇవే నవంబర్ సమరంలో కూటమికి శ్రీరామరక్ష కానున్నాయి.

# గోదావరి జిల్లాలకు జగన్



**రాజమండ్రి,** : వైసీపీ అధినేత వైఎస్ జగన్ చాలా కాలానికి ఆ ప్రాంతానికి వెళ్తున్నారు. రాష్ట్ర రాజకీయ ముఖ చిత్రాన్ని మార్చేసే సత్తా కలిగిన ప్రాంతం అది. 2024 ఎన్నికల్లో టీడీపీ కూటమికి మొత్తానికి మొత్తం సీట్లు పట్టం కట్టి వైసీపీకి జీరో మార్కులు వేసిన కీలక రాజకీయ స్థావరమది. రాజకీయ చైతన్యానికి పెట్టింది పేరు అయిన గోదావరి జిల్లాలలో తమ పర్యటనకు జగన్ శ్రీకారం చుడుతున్నారు. జగన్ ఇప్పటిదాకా రెండేళ్ళ కాలంలో అడపా దడపా పరామర్శలు చేశారు. ఎక్కువగా క్రిష్ణా గుంటూరులలోనే ఆయన పర్యటనలు సాగాయి. మధ్యలో విశాఖ దాకా వచ్చారు. అయితే జగన్ తొలిసారి పశ్చిమ గోదావరి జిల్లా ప్రాంతానికి వస్తున్నారు వారితో కలసి ఆందోళన : పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జగన్ పర్యటన ఉండబోతోంది. ఆక్వా రైతులను పరామర్శించి వారి సాధక బాధలను వినేందుకు జగన్ వస్తున్నారు అని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ మధ్యనే ఆక్వా రైతులు తమ సమస్యలను జగన్ కి తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో కలసి తెలియచేశాయి. ఆ సమయంలో వారికి అండగా ఉంటూ వైసీపీ పోరాటం చేస్తుందని జగన్ హామీ ఇచ్చారు. దానికి అనుగుణంగానే జగన్ పర్యటన భీమవరంలో పెట్టుకున్నారు అని అంటున్నార్. ఆక్వా రైతులను టీడీపీ కూటమి ప్రభుతం రెండేళ్ళ కాలంలో ఆదుకోలేదని వైసీపీ విమర్శిస్తోంది. సిండికేట్ యాజమాన్యాలు దళారులు కుమ్మక్కు అయి ఫీడ్ రేట్లు భారీగా పెంచేసినా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆక్వా రైతులు ఆందోళనలో ఉన్నారని వైసీపీ నేతలు అంటున్నారుఇదిలా ఉంటే ఫీడ్ రేట్లు కొంత తగ్గించినా ఇంకా ఆక్వా రైతులు ఇబ్బందులలోనే ఉన్నారు అని అంటున్నారు. దాంతో ఆక్వా రైతులను స్వయంగా కలసి వారి సాధక బాధకాలను జగన్ వింటారు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరి ఈ సందర్భంగా ఆక్వా రైతులను ఆదుకునేందుకు వైసీపీ తరఫున కార్యాచరణ ప్రకటించే అవకాశం ఉందని అంటున్నారు. వ్యూహం ఇదేనా : ఇదిలా ఉంటే గోదావరి జిల్లాలు వైసీపీని 2024 ఎన్నికల్లో పూర్తి స్థాయిలో దెబ్బేశాయి. దాంతో వైసీపీ అధికారంలోకి రావడం పక్కన పెడితే ప్రతిపక్షంలోకి కూడా వచ్చేందుకు అవసరమైన సీట్లు అందుకోలేకపోయింది. ఈ క్రమంలో రెండేళ్ళ పాలన తరువాత జగన్ గోదావరి బాట పట్టారు అని అంటున్నారు. పోయిన చోటనే వెతుక్కోవాలన్నది రాజకీయ జీవులు చెప్పే మాట. ఆ విషయంలో వైసీపీ అధినాయకత్వం కూడా సరైన దారి ఇదే అని గోదావరి జిల్లాలా బాట పడుతోంది అని అంటున్నారు. ఆక్వా రైతుల సమస్యలనే ఆయుధంగా చేసుకుని కూటమి ప్రభుత్వం మీద గట్టిగానే పోరాటం చేయాలన్నది వైసీపీ ఆలోచనగా చెబుతున్నారు. మరి రాక రాక చాలా కాలానికి భీమవరం వస్తున్న జగన్ కి ఏ విధమైన రిసీవింగ్ ఉంటుంది, వైసీపీకి గోదావరి పల్స్ ఏ విధంగా చిక్కుతాయన్నది వేచి చూడాల్సి ఉంది.

# ఫిరాయింపు ఎమ్మెల్యేల రివర్స్ గేర్..!

# గులాబీ గూటివైపు చూపులు..!?



**హైదరాబాద్,** : బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన ఎమ్మెల్యేల వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. అధికార పార్టీలో చేరితే నియోజకవర్గాలకు భారీగా నిధులు వస్తాయని, పెండింగ్ సమస్యలు పరిష్కారమవుతాయని ఆశించిన పలువురు ఎమ్మెల్యేలకు అనుకున్న స్థాయిలో ఫలితం కనిపించకపోవడంతో అసంతృప్తి పెరుగుతున్నట్లు తెలుస్తోంది. దీంతో కొందరు ఎమ్మెల్యేలు తిరిగి బీఆర్ఎస్ వైపు అడుగులు వేయాలనే ఆలోచనలో ఉన్నారన్న ప్రచారం ఊపందుకుంది. ఈ క్రమంలో బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. వీరి తర్వాత మరికొందరు కూడా ఇదే బాట పట్టే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో సంప్రదింపులు జరుగుతున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం ఉన్నా.. దీనిపై అధికారికంగా ఎలాంటి స్పష్టత రాలేదు. కామారెడ్డి జిల్లా బీర్కూరులో కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో పోచారం శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ చర్చకు మరింత ఊతమిచ్చాయి. తాను మంత్రి పదవి కోసం, డబ్బు కోసం కాంగ్రెస్‌లో చేరలేదని, కేవలం నియోజకవర్గ అభివృద్ధి కోసమే పార్టీ మారానని ఆయన స్పష్టం చేశారు. అయితే తాను ఆశించిన స్థాయిలో పనులు జరగడం లేదన్న అసంతృప్తిని బహిరంగంగానే వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన సమయంలో బాన్సువాడ నియోజకవర్గంలోని పెండింగ్ సమస్యలను ఆరు నెలల్లో పరిష్కరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని పోచారం గుర్తు చేశారు. కానీ ఆ హామీలు పూర్తిగా అమలు కాలేదన్న భావన ఆయన వ్యాఖ్యల్లో వ్యక్తమైంది. మంత్రులకు ఫోన్ చేసినా స్పందించడం లేదని, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా సీఎం మాటలను పట్టించుకోవడం లేదని ఆయన చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లోని అంతర్గత పరిస్థితులపై చర్చకు దారితీశాయి. సీఎం స్వయంగా చెప్పినా పనులు జరగడం లేదని, ముఖ్యమంత్రి కార్యాలయంలో కీలకంగా వ్యవహరించే వేం నరేందర్‌రెడ్డికి పలుమార్లు ఫోన్ చేసినా స్పందన లేదని పోచారం పేర్కొన్నట్లు సమాచారం. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులుగా గెలిచి, ఆ తర్వాత అధికార కాంగ్రెస్ కండువా కప్పుకున్న పదిమంది ఎమ్మెల్యేల పరిస్థితి ప్రస్తుతం ముందు నుయ్యి.. వెనుక గొయ్యిలా తయారైంది. ప్రధానంగా బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ఇటీవల కామారెడ్డి జిల్లా బీర్కూరు ఆత్మీయ సమావేశంలో చేసిన తీవ్ర వ్యాఖ్యలు కాంగ్రెస్ అంతర్గత కలహాలను బహిర్గతం చేశాయి. "నేను మంత్రి పదవి కోసమో, నిధుల కోసమో పార్టీ మారలేదు.. కేవలం బాన్సువాడ అభివృద్ధి కోసమే వచ్చా. కానీ, ఆరు నెలల్లో పెండింగ్ పనులు పూర్తి చేస్తానన్న సీఎం రేవంత్ రెడ్డి హామీలు అమలు కావడం లేదు" అని ఆయన తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. చివరికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎం ముఖ్య సలహాదారు వేం నరేందర్ రెడ్డి కూడా ఫోన్లు ఎత్తడం లేదని ఆయన చేసిన ఆరోపణలు ప్రభుత్వంలో ఫిరాయింపుదారులకు దక్కుతున్న ప్రాధాన్యతను స్పష్టం చేస్తున్నాయి. పోచారం శ్రీనివాసరెడ్డి మాత్రమే కాదు, పార్టీ మారిన ఇతర ఎమ్మెల్యేల పరిస్థితి కూడా ఇలాగే ఉందన్న చర్చ జరుగుతోంది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరినప్పటికీ, ఇటీవల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వాన్ని, గత పాలనను ప్రశంసిస్తూ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికర చర్చకు దారితీశాయి. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కాంగ్రెస్ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు. ఇటీవలి మున్సిపల్ ఎన్నికల్లో ఆయన సోదరుడు బీఆర్ఎస్ తరపున ప్రచారం చేసి మంచి ఫలితాలు సాధించడం, గూడెం 'ఘర్ వాపసీ'కి సంకేతంగా భావిస్తున్నారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డిలు సైతం తమ నియోజకవర్గాల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేక తీవ్ర ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల తిరుగుబాటు సంకేతాలతో కాంగ్రెస్ నాయకత్వం అప్రమత్తమైంది. కాంగ్రెస్ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ ఈ వ్యవహారంపై దృష్టి సారించారు. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోవాలని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఎమ్మెల్యేలకు విజ్ఞప్తి చేశారు. అయితే, ఒకవైపు పాత కాంగ్రెస్ నాయకుల నుంచి వస్తున్న తీవ్ర వ్యతిరేకత, మరోవైపు నిధుల లేమితో ఫిరాయింపు ఎమ్మెల్యేలు తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారు. ఈ క్రమంలోనే కొందరు కీలక ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లతో సంప్రదింపులు జరుపుతున్నారనే ప్రచారం జోరందుకుంది. అధికార పార్టీ కండువా కప్పుకున్న వేళ కనిపించిన ఉత్సాహం ఇప్పుడు ఆవిరైపోయింది. సొంత నియోజకవర్గాల్లో ప్రజలకు ముఖం చూపించలేక ఈ ఎమ్మెల్యేలు సతమతమవుతున్నారు.

### అడకత్తెరలో రెబల్ ఎమ్మెల్యేలు

2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున గెలిచిన పలువురు ఎమ్మెల్యేలు తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. అయితే పార్టీ మారిన తర్వాత కూడా కాంగ్రెస్‌లో వారికి పూర్తి స్థాయి రాజకీయ స్థానం దక్కలేదన్న అసంతృప్తి ఉందని వారి అనుచర వర్గాలు చెబుతున్నాయి. నియోజకవర్గ ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని స్థానిక నేతలు, అనుచరుల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. అధికార పార్టీలోకి వెళ్లిన తర్వాత నిధులు, అభివృద్ధి పనులు వేగంగా వస్తాయని భావించినా.. చాలా చోట్ల పనులు ముందుకు కదలకపోవడం ఎమ్మెల్యేలకు ఇబ్బందిగా మారిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కొంతకాలంగా కాంగ్రెస్‌కు దూరంగా ఉంటున్నట్లు కనిపిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో ఆయన సోదరుడు బీఆర్ఎస్‌లో చేరడం, ఆ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా పనిచేయడం రాజకీయంగా చర్చకు దారితీసింది. పటాన్‌చెరు పరిధిలో బీఆర్ఎస్ మెరుగైన ఫలితాలు సాధించడంతో గూడెం రాజకీయ వైఖరిపై మరింత ఆసక్తి ఏర్పడిందిజగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కూడా నియోజకవర్గ అభివృద్ధి పనులపై ఒత్తిడి ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కీలక రోడ్డు పనులు పార్టీ మారి రెండేళ్లు గడిచినా ఆశించిన స్థాయిలో ముందుకు సాగకపోవడం ఆయనకు ఇబ్బందిగా మారిందని స్థానిక వర్గాలు చెబుతున్నాయి. గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి పరిస్థితి కూడా ఇలాగే ఉంది. గుర్రం లిఫ్ట్ పథకం పనులు చేపట్టడంతో పాటు పలు రిజర్వాయర్ల సామర్థ్యాన్ని పెంచితే నియోజకవర్గానికి ప్రయోజనం కలుగుతుందని ఆయన భావిస్తున్నారు. అయితే ఈ పనుల్లో జాప్యం జరుగుతుండటం ఆయనను కూడా అసంతృప్తికి గురిచేస్తున్నట్లు సమాచారం. ఫిరాయింపు ఎమ్మెల్యేల నుంచి వరుసగా అసంతృప్తి వ్యక్తమవుతుండటంతో కాంగ్రెస్ నాయకత్వం అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ కూడా ఈ అంశంపై ఆరాతీసినట్టు సమాచారం. పోచారం వ్యాఖ్యలపై పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ స్పందిస్తూ.. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోవాలని సూచించారు. అందుబాటులో ఉన్న వనరులతో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలిపారు. అయితే ఎమ్మెల్యేల స్థాయిలో పరిస్థితులు అంత సాఫీగా లేవన్న సంకేతాలు మాత్రం కనిపిస్తున్నాయి. పార్టీ మారిన సమయంలో ఉన్న రాజకీయ ఉత్సాహం తగ్గిపోవడం, స్థానిక కాంగ్రెస్ నాయకత్వంతో సమన్వయం కుదరకపోవడం, అభివృద్ధి పనులకు నిధులు అందకపోవడం, తమ రాజకీయ భవిష్యత్తుపై స్పష్టత లేకపోవడం వంటి అంశాలు వారిని ఇబ్బంది పెడుతున్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలలో కొందరు ఇప్పుడు తమ నిర్ణయాన్ని పునఃపరిశీలిస్తున్నారన్న ప్రచారం ఆసక్తిని పెంచుతోంది. అధికార పార్టీలో చేరిన సమయంలో నియోజకవర్గ అభివృద్ధి, రాజకీయ భవిష్యత్తు దృష్ట్యా తీసుకున్న నిర్ణయం ఆశించిన ఫలితాలు ఇవ్వలేదన్న భావన కొందరిలో బలపడుతున్నట్లు సమాచారం. పోచారం బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేయడం, గూడెం మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్‌కు దూరంగా కనిపించడం, దానం నాగేందర్ ఇటీవల బీఆరెస్ నాయకత్వాన్ని పొగడటం, సంజయ్ కుమార్, కృష్ణమోహన్‌రెడ్డి నియోజకవర్గ సమస్యలపై ఒత్తిడి ఎదుర్కొంటుండటం.. ఇవన్నీ ఫిరాయింపు ఎమ్మెల్యేల భవిష్యత్ అడుగులు ఎటు పడతాయా అన్న ఆసక్తిని పెంచుతున్నాయి. అయితే నిజంగానే వీరిలో కొందరు తిరిగి బీఆర్ఎస్‌లోకి వెళ్తారా? లేక ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నాయకత్వం అసంతృప్తిని చల్లార్చి వారిని పార్టీలోనే కొనసాగేలా చూస్తారా? అన్నది ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో కీలక ప్రశ్నగా మారింది.

## బ్రిటన్ హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యుడు ఉదయ్ నాగరాజు సన్మానం : పాల్గొన్న హరీష్ రావు




సిద్దిపేట : బ్రిటన్ పార్లమెంట్ హౌస్ ఆఫ్ లార్డ్స్ కు ఎన్నికైన సిద్దిపేట ముద్దుబిడ్డ ఉదయ్ నాగరాజు రి పౌర సన్మాన కార్యక్రమం సిద్దిపేటలోని విపంచి కళానిలయంలో అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి హరీష్ రావు ముఖ్య అతిథిగా హాజరై ఉదయ్ నాగరాజు కి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఉదయ్ నాగరాజు తన పేరుకు తగ్గట్లే సార్థకత తీసుకొచ్చారు, తెలంగాణలో ఉదయించి బ్రిటన్లో వెలుగొందుతున్నారు. మన రెండు తెలుగు రాష్ట్రాల నుండి బ్రిటన్ పార్లమెంటుకు ఎన్నికైన మొట్టమొదటి వ్యక్తి ఉదయ్ నాగరాజని కొనియాడారు. ఎంతో కృషి పట్టుదల ఉంటే తప్ప అంత ఉన్నతమైన పదవి రాలేదు. ఉదయ్ ది నాది రెండున్నర దశాబ్దాల పరిచయం. ఆయన పెళ్ళికి కూడా హాజరయ్యాను. తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా లండన్ నుండి ఉద్యమానికి మద్దతిచ్చారు. మనం ఎట్లా అయితే ఇక్కడ పోరాడామే ఆయన కూడా తన భాగస్వామ్యం అందించారని గుర్తు చేసుకున్నారు. ఉదయ్ నాగరాజు బ్రిటన్ లో మరింత ఉన్నతమైన పదవులు పొందాలని, అక్కడి ప్రజలకు మంచి సేవలు అందించాలని కోరుకుంటున్నాను. ఉదయ్ నాగరాజు ఎంత దూరం వెళ్ళినా మన ఆచారాలను, సంప్రదాయాలను పాటించడం సంతోషంగా ఉంది. ఉదయ్ నాగరాజు కి సన్మానం చేయడం అంటే సిద్దిపేట ప్రజలకు, తెలంగాణకే కాకుండా యావత్ భారతీయులకు గర్వకారణం. పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యం అనేది ఉదయ్ ని చూస్తే తెలుస్తోంది, యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలి. ఉదయ్ నుండి యువత నేర్చుకోవాలి. చిన్న పల్లెటూరులో పుట్టి బ్రిటన్ పార్లమెంటు కు ఎన్నికయ్యారు. ఆయన కృషి, పట్టుదల, సేవలు ఆయనకు ఇంత ఉన్నతమైన స్థానం అందించాయి. ప్రతి మనిషిలో కూడా సామర్థ్యం ఉంటుంది. వాటిని వెలికితీసి కష్టపడి విజయం సాధించాలని అన్నారు.

## చెన్నై బుల్లెట్ రైలు కారిడార్లో నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని చేర్చాలి

### -కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ను కోరిన ఎంపి చామల

న్యూఢిల్లీ : న్యూఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ను భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి కలిసారు. హైదరాబాద్-చెన్నై బుల్లెట్ రైలు కారిడార్లో నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని చేర్చే విషయాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేసారు. గ్రీన్ ఫీల్డ్ అలైన్మెంట్కు బదులుగా ఇప్పటికే ఉన్న ఎన్హెచ్-65 (ఔఊ-65) కారిడార్ గుండా ఈ మార్గాన్ని నిర్మిస్తే, ఆ ప్రాంతంలోని పట్టణాలు, వాణిజ్య కేంద్రాలు మరియు ప్రజలకు మెరుగైన కనెక్టివిటీ లభిస్తుందని వివరించారు.

## బిడ్ వేసి చేతులెత్తేసిన బిల్డర్.. రూ.5 కోట్లు లాస్



**హైదరాబాద్,** : హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో సంచలనం సృష్టిస్తూ కోకాపేట ప్లాట్ నంబర్ 17లో 4.59 ఎకరాల భూమికి ఎకరాకు రూ. 136.50 కోట్ల చొప్పున బిడ్ వేసిన వజ్రా కన్‌స్ట్రక్షన్స్ చెల్లింపులు చేయలేకపోయింది. దీంతో వేలం నిబంధనల ప్రకారం హెచ్ఎమ్‌డీఏ సదరు సంస్థ చెల్లించిన రూ. 5 కోట్ల ఈఎమ్‌డీ డిపాజిట్‌ను జప్తు చేసింది. ప్రీ-లాంచ్ విక్రయాల ద్వారా నిధులు సమీకరించాలనే వ్యూహం ఫలించకపోవటంతో భూమితో పాటు డిపాజిట్‌నూ సదరు సంస్థ కోల్పోయింది. కాగా, ఈ భూమిని మళ్లీ వేలం వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన కోకాపేట నియోపోలిస్ భూముల వేలంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. వేలంలో రికార్డు స్థాయిలో భారీ బిడ్ వేసి ప్లాట్‌ను దక్కించుకున్న వజ్రా కన్‌స్ట్రక్షన్స్ అనే రియల్ ఎస్టేట్ సంస్థ నిర్ణీత గడువులోగా నిధులు చెల్లించలేక చేతులెత్తేసింది. దీంతో వేలం నిబంధనలను కఠినంగా అమలు చేస్తూ.. హెచ్ఎండీఏ సదరు నిర్మాణ సంస్థ భద్రతా డిపాజిట్‌గా చెల్లించిన రూ. 5 కోట్ల అర్నెస్ట్ మనీ డిపాజిట్ (ఇఓఅ)ని జప్తు చేసింది. కోకాపేట ప్లాట్ నంబర్ 17లోని 4.59 ఎకరాల భూమికి వజ్రా కన్‌స్ట్రక్షన్స్ ఎకరాకు ఏకంగా రూ. 136.50 కోట్ల చొప్పున బిడ్ దాఖలు చేసి భూములు దక్కించుకుంది. ఈ లెక్కన ఆ భూమి మొత్తం విలువ రూ. 626 కోట్లకు పైగానే ఉంటుంది. అయితే, భూమి కొనుగోలుకు అవసరమైన పూర్తి ఆర్థిక ఇన్వెస్ట్‌మెంట్ సొంతంగా లేనప్పటికీ.. ప్రాజెక్టు ప్రకటించి ప్రీ-లాంచ్, ఓపెన్ టు పబ్లిక్ విక్రయాల ద్వారా కొనుగోలుదారుల నుంచి ముందస్తుగా నిధులు సమీకరించి ప్రభుత్వానికి చెల్లించవచ్చని ఆ సంస్థ భావించింది. అయితే మార్కెట్‌లో ఆశించిన స్థాయిలో ప్రీ-లాంచ్ విక్రయాలు జరగకపోవడంతో ఆ వ్యూహం ఫలించలేదు. నిర్ణీత గడువు ముగిసినా డబ్బులు చెల్లించకపోవటంతో రూ. 5 కోట్ల డిపాజిట్‌ను హెచ్ఎండీఐ జప్తు చేసింది. ఫలితంగా వజ్రా కన్‌స్ట్రక్షన్స్ రూ. 600 కోట్లకు పైగా విలువైన కోకాపేట స్థలంతో పాటు రూ. 5 కోట్ల నగదును కోల్పోయి రెండు రకాలుగా నష్టాన్ని మూటగట్టుకుంది. భవిష్యత్ ప్రాజెక్టు విక్రయాలను నమ్ముకొని ఆర్థిక సామర్థ్యానికి మించి బిడ్లు వేయడం ఎంత ప్రమాదకరమో ఈ ఘటన స్పష్టం చేస్తోందని రియల్ ఎస్టేట్ నిపుణులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా.. చెల్లింపులు జరగని నేపథ్యంలో ప్లాట్ నంబర్ 17 కింద ఉన్న 4.59 ఎకరాల స్థలానికి త్వరలోనే మళ్లీ పారదర్శకంగా బహిరంగ వేలం నిర్వహించాలని హెచ్ఎండీఏ నిర్ణయించింది. గత వేలంలో ఎకరాకు 136.50 కోట్ల కోట్లకు పైగా పలుకగా.. కొత్త వేలంలో ఈ స్థలానికి ఎలాంటి ధర నమోదవుతుందనేది ఇప్పుడు నగర రియల్టీ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. కోకాపేట్‌లోని నియోపోలిస్, గోల్డెన్ మైల్ లేఅవుట్లతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న విలువైన భూములను వేలం వేయడానికి హెచ్ఎండీఏ సిద్ధమైంది. నిధుల సమీకరణే లక్ష్యంగా వేలానికి రెడీ అయ్యారు. నియోపోలిస్‌లో ఎకరానికి కనీస ధర రూ. 120 కోట్లుగా నిర్ణయించగా.. గోల్డెన్ మైల్‌లో రూ. 70 కోట్లుగా ఫిక్స్ చేసారు. ఈ వేలం ప్రక్రియ ఆగస్టు 24 నుంచి సెప్టెంబర్ 9 వరకు జరగనుంది. మోకిలా, బాచుపల్లి, సూరారం వంటి నివాస ప్రాంతాల్లోని ఖాళీ ప్లాట్లను సైతం ఈ-వేలంలో ఉంచారు.

## మోడీ బహుమతుల వేలంతో 52 కోట్లకు పైగా నిధులు



**న్యూఢిల్లీ,** : భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వివిధ సందర్భాల్లో అందే కానుకలు, స్మృతిచిహ్నాలు ఇప్పుడు ఆసక్తికరమైన అంశంగా మారాయి. ప్రధాని అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడు, వివిధ సంస్థలు, ప్రముఖులు, రాజకీయ నాయకులు, క్రీడాకారులు, ఇతర ప్రతినిధులు ఆయనకు అనేక రకాల బహుమతులు, మెమెంటోలు అందజేస్తుంటారు. వీటిని కేంద్ర ప్రభుత్వం క్రమం తప్పకుండా ఇ-వేలం నిర్వహించి విక్రయిస్తోంది. ఈ వేలాల ద్వారా ఇప్పటివరకు రూ.52 కోట్లకు పైగా ఆదాయం సమకూరినట్లు కేంద్రం వెల్లడించింది. కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షేఖావత్ లోక్‌సభలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ప్రధాని కానుకల వేలం ద్వారా వచ్చిన ఆదాయానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడర్న్ ఆర్ట్ ఆధ్వర్యంలో ఈ వేలం ప్రక్రియ కొనసాగుతోంది.

2021 తొలి ఎడిషన్: రూ.3.1 కోట్లు
2022 రెండో ఎడిషన్: రూ.3.6 కోట్లు
2023 మూడో ఎడిషన్: రూ.15.8 కోట్లు
2023 నాలుగో ఎడిషన్: రూ.14.4 కోట్లు
2024 ఐదో ఎడిషన్: రూ.11.16 కోట్లు
2024 ఆరో ఎడిషన్: రూ.2.24 కోట్లు
2025 ఏడో ఎడిషన్: రూ.1.89 కోట్లు

ఈ మొత్తం కలిపితే రూ.52 కోట్లకు పైగా నిధులు సమకూరినట్లు కేంద్రం తెలిపింది. సాధారణంగా ప్రధాని మోదీ జన్మదినమైన సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 31 వరకు ఈ-వేలం నిర్వహిస్తున్నట్లు కేంద్ర మంత్రి వివరించారు. 2019కు ముందు ప్రధానికి వచ్చిన ఇలాంటి కానుకలు, స్మృతిచిహ్నాలను ఆధ్వర్యంలో ఈ తరహాలో వేలం వేసే విధానం లేదని కేంద్ర మంత్రి షేకావత్ పేర్కొన్నారు. ప్రధాని మోదీకి అందిన కానుకల్లో దేశంలోని వివిధ ప్రాంతాల సంస్కృతి, కళా సంపదకు ప్రతీకలైన వస్తువులు ఉంటాయి. పెయింటింగ్స్, శిల్పాలు, హస్తకళా వస్తువులు, మతపరమైన విగ్రహాలు, చేనేత వస్త్రాలు, క్రీడా స్మృతిచిహ్నాలు వంటి అనేక రకాల వస్తువులు వేలానికి వస్తాయి. వాటిలో కొన్ని వస్తువులు భారీ ధరలు పలికాయి. గాజు ఫ్రేమ్‌లో మినియేచర్ ఆలయ నిర్మాణంతో ఉన్న తుల్జా భవానీ విగ్రహం సుమారు రూ.1.03 కోట్ల వరకు ధర పలికినట్లు సమాచారం. అయోధ్య రామమందిర మెటాలిక్ మోడల్, జమ్మూకశ్మీర్ పష్మినా షాల్, తంజావూరు రామ దర్బార్ చిత్రం, నటరాజ మెటాలిక్ విగ్రహం, గుజరాత్ రోగన్ ఆర్ట్ 'ట్రీ ఆఫ్ లైఫ్', నాగాలాండ్ చేనేత షాల్, వివిధ వస్త్రాలు, పెయింటింగ్స్ కూడా వేలంలో ఆకర్షణగా నిలిచాయి. క్రీడలకు సంబంధించిన వస్తువులు కూడా వేలంలో ప్రత్యేక ఆసక్తిని కలిగించాయి. 2024 పారాలింపిక్స్ క్రీడాకారుల బూట్లు, ఒలింపిక్, పారాలింపిక్ క్రీడా సామగ్రితో పాటు స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాకు సంబంధించిన జావెలిన్, రామమందిరం, కాశీ విశ్వనాథ ఆలయ నమూనాలు వంటి వస్తువులు కూడా వేలంలోకి వచ్చాయి. ప్రధాని మోదీకి వచ్చిన కానుకలను వేలం వేసి వచ్చిన ఆదాయాన్ని నమామి గంగే కార్యక్రమానికి కేటాయిస్తున్నట్లు కేంద్రం తెలిపింది. గంగా నది పరిరక్షణ, పునరుద్ధరణ, కాలుష్య నివారణ వంటి కార్యక్రమాలకు ఈ నిధులను ఉపయోగిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమమైన నమామి గంగే కింద గంగా, దాని ఉపనదుల్లో కాలుష్యాన్ని తగ్గించడం, నదీ పునరుజ్జీవనం, పర్యావరణ వ్యవస్థను పరిరక్షించడం వంటి చర్యలు చేపడుతున్నారు. మురుగునీటి శుద్ధి మౌలిక సదుపాయాలు, రివర్‌ఫ్రంట్ అభివృద్ధి, జీవవైవిధ్య పరిరక్షణ తదితర ప్రాజెక్టులు ఇందులో భాగంగా ఉన్నాయి. ఈ కార్యక్రమాన్ని నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగా) అమలు చేస్తోంది. ప్రధాని మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కూడా తనకు వచ్చిన కానుకలను వేలం వేసి వచ్చిన మొత్తాన్ని బాలికల విద్య కోసం వినియోగించేవారని కేంద్రం వెల్లడించింది. ఇప్పుడు అదే విధానాన్ని జాతీయ స్థాయిలో కొనసాగిస్తూ.. వేలం ద్వారా వచ్చే ఆదాయాన్ని గంగా నది పరిరక్షణకు కేటాయిస్తున్నట్లు తెలిపింది. అంటే.. ప్రముఖులు, సంస్థలు ప్రధానమంత్రికి అందించిన కానుకలు వ్యక్తిగతంగా భద్రపరచడం కాకుండా.. వాటిని ప్రజా ప్రయోజనానికి ఉపయోగపడేలా వేలం వేస్తున్నారు. వేలం ద్వారా వచ్చిన నిధులు దేశంలోని కీలక పర్యావరణ కార్యక్రమానికి మళ్లించడం ఈ ప్రక్రియలో ప్రధాన అంశంగా నిలుస్తోంది.

## మారనున్న కేబీఆర్ పార్కు రూపు రేఖలు

**హైదరాబాద్,** : హైదరాబాద్ ప్రజలకు మరో సూపర్ న్యూస్. నగరంలో ప్రముఖ పార్క్‌గా ప్రసిద్ధి పొందిన కేబీఆర్ పార్క్ వద్ద రూపురేఖలు పూర్తిగా మారనున్నాయి. ఈ పార్క్ వద్ద విపరీతమైన ట్రాఫిక్ రద్దీ ఉంటుంది. దీనిని తగ్గించేందుకు ప్రభుత్వం సరికొత్త ఆలోచన చేసింది. పార్క్ చుట్టూ ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌ల నిర్మాణానికి ముందడుగు వేసింది. మొత్తం 14 నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. ఏడు ప్రధాన కూడళ్ల వద్ద ఈ నిర్మాణాలు జరగనున్నాయి. మొన్నటివరకు కోర్టు కేసులు, భూసేకరణ ప్రక్రియ వల్ల కొంత జాప్యం జరగగా.. ఇప్పుడు అవన్నీ తొలగిపోయాయి. దీంతో అధికారులు ప్రక్రియను మరింత వేగవంతం చేశారు. రెండేళ్లలో పనులన్నీ పూర్తి చేయాలనే లక్ష్యం నిర్దేశించుకున్నారు. వాహనదారులకు ఇబ్బంది కలగకుండా పనులు త్వరతగతిన పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 36 నుంచి కేబీఆర్ పార్క్ రోడ్డు మధ్య నాలుగు లైన్ల ఫ్లైఓవర్ ఉంటుంది. ఇక పంజాగుట్ట నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వైపుకు 3 లైన్ల ఫ్లైఓవర్ నిర్మిస్తారు. ఇక మహారాజా అగ్రసేన జంక్షన్ నుంచి బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 10 వైపు 2 లైన్ల ఫ్లైఓవర్ నిర్మించనున్నారు. ఇక ఫిల్మ్ నగర్-బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 మధ్య 2 లైన్లతో కూడిన ఫ్లైఓవర్ ప్రతిపాదించారు. అలాగే జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్-జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 45 మధ్య 2 లైన్ల ఫ్లైఓవర్ ఉంటుంది. ఇక వీటితో పాటు మొత్తం 6 అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. ఫిల్మ్ నగర్ జంక్షన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వైపు 2 లైన్ల అండర్ పాస్, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి నుంచి ఫిల్మ్ నగర్ వైపు ఒక అండర్ పాస్, ఎల్వీ ప్రసాద్ నుంచి పంజాగుట్ట వైపు 3 లైన్ల అండర్ పాస్, రోడ్డు నెంబర్ 45 నుంచి కేబీఆర్ పార్క్ ఎంట్రన్స్ వరకు ఒక అండర్ పాస్ ఉంటుంది. దాదాపు ఈ ప్రాజెక్టులు పూర్తి చేయడానికి రూ.1090 కోట్లు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేశారు. వీటిల్లో నిర్మాణ పనుల కోసం రూ.699.75 కోట్లు ఖర్చు కానుండగా.. భూసేకరణ ప్రక్రియ కోసం రూ.390 కోట్లు ఖర్చు అవుతాయని అంచనా వేస్తున్నారు. ఉక్కు వంతెనల నిర్మాణం వల్ల భూసేకరణ ఖర్చు తగ్గుతుందని, తక్కువ స్థలంలోనే పనులు చేపట్టవచ్చని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే కేబీఆర్ పార్క్ వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ తగ్గుతుంది. సిగ్నల్ ఫ్రీ జర్నీ వాహనదారులకు లభించనుంది. హైటెక్ సిటీ, ఫిల్మ్ నగర్ వె?పు వెళ్లేవారు వేగవంతంగా చేసుకోవచ్చు.

## ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మృతి పై తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్ : వన్యప్రాణుల వేట కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ ఉచ్చులో చిక్కుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చెరువుసింగారం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నవీన్ మృతి చెందడం పై అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అనుమానితులు జంతువులను వేటాడుతున్నారన్న సమాచరంతో వారిని పట్టుకునేందుకు మరో ముగ్గురు బీట్ ఆఫీసర్లతో కలిసి వెళ్ళిన నవీన్ బూర్గంపాడు మండలం నకిరేపేట గ్రామంలో విధి నిర్వహణలో భాగంగా ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమని మంత్రి అన్నారు. ఈ ఘటన పై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డిఎఫ్ఓ సిద్ధార్థ విక్రమ్ సింగ్ తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. నవీన్ ను వెంటనే హాస్పిటల్ కు తీసుకెళ్ళినప్పటికీ అప్పటికే మృతిచెందినట్లు డిఎఫ్ఓ మంత్రికి వివరించారు. అటవీ సంపద, వన్యప్రాణుల సంరక్షణలో అటవీ సిబ్బంది పోషిస్తున్న పాత్ర అసమాన్యమైనదని మంత్రి కొండా సురేఖ అన్నారు. వన్యప్రాణులను వేటాడేందుకు విద్యుత్ తీగలను అమర్చడం అత్యంత ప్రమాదకరమైన చర్య అని, ఇలాంటి అక్రమాలకు పాల్పడే వ్యక్తుల వల్ల వన్యప్రాణులతో పాటు అటవీ శాఖ సిబ్బంది, స్థానిక ప్రజల ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడుతున్నదని మంత్రి సురేఖ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై అటవీ శాఖ, పోలీసు అధికారులు సమగ్ర దర్యాప్తు చేపట్టి, బాధ్యులను చట్టప్రకారం కఠినంగా శిక్షించేలా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. మృతిచెందిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నవీన్ కుటుంబానికి మంత్రి సురేఖ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# ఇండిగో బిగ్ ఆఫర్ .. 20 వేల ఫ్రీ టికెట్లు...!

దేశీయ విమానయాన రంగంలో ప్రముఖ సంస్థ అయిన ఇండిగో తమ 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రయాణికులకు ఒక భారీ ఆఫర్‌ను ప్రకటించింది. తమ కస్టమర్లకు కృతజ్ఞతగా సుమారు 20,000 ఉచిత డొమెస్టిక్ (దేశీయ) టికెట్లను అందించనున్నట్లు
సంస్థ వెల్లడించింది. ఈ ప్రత్యేక ఆఫర్ కింద టికెట్ బుక్ చేసుకున్న ప్రయాణికులలో కొందరిని
యాదృచ్ఛికంగా ఎంపిక చేసి, వారు వెచ్చించిన టికెట్ ధరను రీఫండ్ రూపంలో తిరిగి చెల్లించనున్నారు. లక్కీ విజేతలకు ఒక ఖఔఖీ పై గరిష్ఠంగా ?10,000 వరకు రీఫండ్ పొందే అవకాశం కలగనుంది. విమాన ప్రయాణాన్ని మరింత అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఇండిగో ఈ ఆఫర్‌ను తీసుకొచ్చింది. ఈ ఆఫర్ ప్రయోజనాన్ని పొందడానికి ప్రయాణికులు కొన్ని నిర్దిష్టమైన నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. ఈ నెల 4వ తేదీ నుండి 6వ తేదీ మధ్యలో బుక్ చేసుకున్న ప్రయాణికులకు మాత్రమే ఈ ఆఫర్ వర్తిస్తుంది.
తమ కస్టమర్లకు కృతజ్ఞతగా సుమారు 20,000 ఉచిత డొమెస్టిక్ (దేశీయ) టికెట్లను అందించనున్నట్లు సంస్థ వెల్లడించింది. ఈ ప్రత్యేక ఆఫర్ కింద టికెట్ బుక్ చేసుకున్న ప్రయాణికులలో కొందరిని యాదృచ్ఛికంగా ఎంపిక చేసి, వారు వెచ్చించిన టికెట్ ధరను రీఫండ్ రూపంలో తిరిగి చెల్లించనున్నారు. లక్కీ విజేతలకు ఒక ఖఔఖీ పై గరిష్ఠంగా ?10,000 వరకు రీఫండ్ పొందే అవకాశం కలగనుంది. అలాగే, థర్డ్ పార్టీ యాప్‌లు లేదా ఏజెంట్ల ద్వారా కాకుండా, కేవలం ఇండిగో అధికారిక వెబ్‌సైట్, మొబైల్ యాప్ లేదా వారి ఏఐ అసిస్టెంట్ '6ఇఐఎజీతి' ద్వారా బుకింగ్ చేసుకున్న వారిని మాత్రమే ఈ రాండమ్ ఎంపిక ప్రక్రియకు పరిగణనలోకి తీసుకుంటారు. పరిమిత వ్యవధిలో అందుబాటులో ఉన్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి విమాన ప్రయాణికులు ఆసక్తి చూపుతున్నారు.



# గరిష్ఠ స్థాయికి ద్రవ్యోల్బణం...




ఆహార, ఇంధన ధరల ప్రభావంతో మూడో త్రైమాసికంలో ద్రవ్యోల్బణం గరిష్ఠ స్థాయికి చేరుకునే అవకాశం ఉందని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా హెచ్చరించారు. ప్రపంచ ఆర్థిక అనిశ్చితుల నేపథ్యంలో ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. రెపోరేటును 5.25 శాతం వద్ద యథాతథంగా కొనసాగించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆర్‌బీఐ గవర్నర్ బుధవారం ద్రవ్య విధాన సమీక్షను ప్రకటించారు. పాలసీ రేటుపై తటస్థ వైఖరిని కొనసాగిస్తూ, ప్రస్తుత పరిస్థితుల్లో వడ్డీ రేటులో ఎలాంటి మార్పులు చేయకూడదని ఎంపీసీ అభిప్రాయపడిందని గవర్నర్ తెలిపారు. ప్రపంచ ఆర్థిక పరిస్థితులపై స్పందించిన ఆయన, పశ్చిమ ఆసియా సంఘర్షణ కీలక వాణిజ్య మార్గాలపై ప్రభావం చూపుతూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సవాళ్లు విసురుతోందన్నారు. అంతర్జాతీయ పరిణామాలు, సరఫరా వ్యవస్థలో నెలకొంటున్న అంతరాయాలు ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే, 2027 ఆర్థిక సంవత్సరానికి భారత వాస్తవ జీడీపీ వృద్ధి రేటు 6.7 శాతంగా అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు. ఇది గత అంచనాతో పోలిస్తే 10 బేసిస్ పాయింట్లు ఎక్కువ. లోటు వర్షపాతం, అంతర్జాతీయ భౌగోళిక ఉద్రిక్తతలు, పశ్చిమ ఆసియా పరిస్థితులు దేశ ఆర్థిక దృక్పథంపై అనిశ్చితిని కొనసాగిస్తున్నాయని ఆర్‌బీఐ పేర్కొంది.

# యుపిఐ చెల్లింపులపై మళ్లీ మర్చంట్ ఛార్జీలు..?




యుపిఐ చెల్లింపులపై మళ్లీ మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండిఆర్) విధించాలని బిజెపి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్ సవరణ బిల్లును కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. దీంతో బ్యాంక్‌లు, ఫిన్‌టెక్ సంస్థలకు వ్యాపారులు కొత్తగా చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం యుపిఐ లావాదేవీలపై వ్యాపారుల నుంచి ఎలాంటి ఎండిఆర్ వసూలు చేయడం లేదు. అయితే డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ నిర్వహణకు బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలకు స్థిరమైన ఆదాయం అవసరమనే డిమాండ్ నేపథ్యంలో ఈ మార్పులు తీసుకురానున్నారు. ప్రభుత్వం పరిశీలిస్తున్న ప్రతిపాదన ప్రకారం వార్షిక టర్నోవర్ రూ.1.5 కోట్లకు పైగా ఉన్న వ్యాపారులు చేసే రూ.2,000కు మించిన యుపిఐ లావాదేవీలపై 0.3 శాతం నుంచి 0.5 శాతం వరకు ఎండిఆర్ విధించే అవకాశం ఉందని తెలుస్తోంది. చిన్న వ్యాపారులు, వినియోగదారులకు మాత్రం మినహాయింపు ఉండే అవకాశాలు ఉన్నాయి. జులైలో యుపిఐ ద్వారా 2360 కోట్ల లావాదేవీలు నమోదవగా, వాటి మొత్తం విలువ రూ.29.9 లక్షల కోట్లకు చేరింది. ఫోన్‌పే, గూగుల్ పే, పేటియం వంటి సంస్థలు యుపిఐ మార్కెట్‌లో ఆధిపత్యం కొనసాగిస్తున్నాయి. బ్రోకరేజ్ సంస్థ జెఫరీస్ అంచనా ప్రకారం రూ.2,000కు పైబడిన లావాదేవీలు మొత్తం సంఖ్యలో కేవలం 4 శాతం ఉన్నాయి. వాటి విలువ మొత్తం వ్యాపార చెల్లింపుల్లో 67 శాతం ఉంటుందని అంచనా.
అయితే డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ నిర్వహణకు బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలకు స్థిరమైన ఆదాయం అవసరమనే డిమాండ్ నేపథ్యంలో ఈ మార్పులు తీసుకురానున్నారు. ప్రభుత్వం పరిశీలిస్తున్న ప్రతిపాదన ప్రకారం వార్షిక టర్నోవర్ రూ.1.5 కోట్లకు పైగా ఉన్న వ్యాపారులు చేసే రూ.2,000కు మించిన యుపిఐ లావాదేవీలపై 0.3 శాతం నుంచి 0.5 శాతం వరకు ఎండిఆర్ విధించే అవకాశం ఉందని తెలుస్తోంది. చిన్న వ్యాపారులు, వినియోగదారులకు మాత్రం మినహాయింపు ఉండే అవకాశాలు ఉన్నాయి. జులైలో యుపిఐ ద్వారా 2360 కోట్ల లావాదేవీలు నమోదవగా, వాటి మొత్తం విలువ రూ.29.9 లక్షల కోట్లకు చేరింది. ప్రతిపాదిత ఎండిఆర్ అమల్లోకి వస్తే డిజిటల్ పేమెంట్స్ పరిశ్రమకు ఏటా రూ.5,000 కోట్ల నుంచి రూ.10,000 కోట్ల వరకు అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉందని తెలిపింది. అయితే ఛార్జీల శాతం, అమలు తేదీపై ప్రభుత్వం ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. పెద్ద మొత్తాల డిజిటల్ లావాదేవులపై కేంద్ర ప్రభుత్వం మెర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండిఆర్) రుసుంను మళ్లీ తీసుకొస్తే తాము లావాదేవీలను నిలిపివేస్తామని సగంపైగా ప్రజలు తెలిపారు. రూ.3,000 పైచిలుకు లావాదేవుల కోసం తాము యుపిఐ వాడకాన్ని నిలిపివేస్తామని 53 శాతం మంది వినియోగదారులు ప్రముఖ సర్వే సంస్థ లోకల్ సర్కిల్స్ నిర్వహించిన సర్వేలో అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా 322 జిల్లాల నుంచి 45,000 పైగా మంది నుంచి అభిప్రాయాలను సేకరించింది. రూ.3,000 కంటే ఎక్కువ విలువైన లావాదేవులపై ఎండిఆర్ విధిస్తే వారిలో 27 శాతం మంది క్రెడిట్ కార్డులకు, 14 శాతం మంది డెబిట్ కార్డులకు, మరో 12 శాతం మంది బ్యాంక్ బదిలీలు లేదా నగదు చెల్లింపులకు మారిపోతామని తెలిపినట్లు సర్వే వెల్లడించింది. అయితే వ్యాపారులే ఈ రుసుం భారాన్ని భరిస్తేనే తాము యథావిధిగా యుపిఐని వాడుతామని 18 శాతం మంది పేర్కొనగా.. తామే ఆ రుసుం చెల్లించాల్సి వచ్చినా యుపిఐని కొనసాగిస్తామని 12 శాతం మంది తెలిపారు.

# మహిళలకు గుడ్ న్యూస్ తెలిపిన మెప్మా లోన్లు....




పట్టణ ప్రాంతాల్లో నివసించే ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలనే గొప్ప లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అద్భుతమైన అవకాశం అందిస్తోంది. మహిళా పారిశ్రామికవేత్తలుగా తమ స్వంత వ్యాపారం ప్రారంభించాలని కోరుకునే వారికి మెప్మా అధికారులు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారు. డ్వాక్రా సంఘాలలో సభ్యులుగా ఉన్న చదువుకున్న మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇప్పించి వారిని వ్యాపార రంగంలో ముందుకు తీసుకువెళతారు. ఈ పథకం ద్వారా ఎంపిక చేసిన ఫ్రాంఛైజీ ప్రాజెక్టుల ద్వారా మహిళలు సులభంగా తమ సొంత దుకాణాలు తెరవవచ్చు. ఎంబ్రాయిడరీ, టీ టైం, బ్యూటీపార్లర్లు, మిల్లెట్ ఫుడ్ యూనిట్లు వంటి వివిధ రంగాలలో నైపుణ్యం పెంపొందించుకోవడానికి ఇది చక్కటి అవకాశం. వ్యాపార రంగంలో సరైన అనుభవం లేని వారికి కూడా అధికారుల పర్యవేక్షణలో ప్రాథమిక శిక్షణ ఇస్తారు. స్వయం ఉపాధి సాధించాలనే పట్టుదల ఉన్న ప్రతి మహిళకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా మారుతుంది. నూతనంగా వ్యాపారం ప్రారంభించాలనుకునే మహిళలందరికీ బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీకే రుణాలు ఇప్పించే ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. లక్ష రూపాయల నుంచి ఐదు లక్షల రూపాయల వరకు విలువైన ప్రాజెక్టులు ఎంచుకోవడానికి అవకాశం కల్పించారు. అర్హులైన ప్రతి దరఖాస్తుదారునికి ప్రభుత్వం తరపున ముప్పై శాతం వరకు సబ్సిడీ నేరుగా అందుతుంది. ఆధార్ కార్డు, పాన్ కార్డ్, బ్యాంకు ఖాతా వివరాలతో సమీపంలోని మెప్మా కార్యాలయాన్ని సంప్రదించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలి. డ్వాక్రా సంఘాలలో సభ్యులుగా ఉన్న చదువుకున్న మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇప్పించి వారిని వ్యాపార రంగంలో ముందుకు తీసుకువెళతారు. ఈ పథకం ద్వారా ఎంపిక చేసిన ఫ్రాంఛైజీ ప్రాజెక్టుల ద్వారా మహిళలు సులభంగా తమ సొంత దుకాణాలు తెరవవచ్చు. వ్యాపార ఎంపిక మొదలుకొని మార్కెట్ వసతి కల్పించడం వరకు ప్రతి దశలోనూ సిబ్బంది అండగా ఉంటారు. సొంతంగా చిన్న పరిశ్రమ స్థాపించే మహిళలకు అన్ని రకాల రాయితీలు అందించాలని ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసింది. బ్యాంక్ లింకేజీ ద్వారా రుణం మంజూరు చేయించి త్వరగా షాపులు ప్రారంభించేలా అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. సొంతంగా వ్యాపారం నిర్వహించుకుంటూ ప్రతి నెలా ఇరవై వేల రూపాయల నుంచి యాభై వేల రూపాయల వరకు సంపాదించే ప్రణాళికను ప్రభుత్వం రూపొందించింది.
పద్దెనిమిది సంవత్సరాల నుంచి అరవై సంవత్సరాల వయస్సు కలిగిన డ్వాక్రా మహిళలు మాత్రమే ఈ అద్భుతమైన పథకానికి పూర్తిగా అర్హులు. అరకు కాఫీ, తృప్తి క్యాంటీన్, మొబైల్ యాక్సెసరీస్, ఐస్ క్రీమ్స్, మిస్ బర్గర్ వంటి లాభసాటి ఫ్రాంఛైజీలను ఎంచుకోవచ్చు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా మార్కెటింగ్ చేసుకునేలా ప్రత్యేక బ్రాండ్ సదుపాయం కూడా కల్పిస్తున్నారు. కష్టపడి పనిచేసే తత్వం ఉన్న మహిళలు ఈ సదవకాశాన్ని ఉపయోగించుకుంటే కుటుంబానికి ఆర్థిక భరోసా లభిస్తుంది. ఇంట గెలిచి రాత మార్చుకోవాలని ఆశించే ప్రతి మహిళ పారిశ్రామికవేత్తగా మారడానికి ఇదే సరైన సమయం.

# ఎల్ఐసీలో 6 శాతం వాటాల విక్రయం షురూ




దేశంలోని అతిపెద్ద ప్రభుత్వరంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ)లో 6 శాతం వాటాల విక్రయ ప్రక్రియ మొదలయ్యింది.
మంగళవారం నుంచి ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా ఈ వాటాలను అమ్మడం ద్వారా రూ.31,000 కోట్లు పైగా రాబట్టుకోవాలని మోడీ సర్కార్ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం ఎల్ఐసీ షేర్లను 10 శాతం తక్కువకు విక్రయించాలని నిర్ణయించింది. ఈ దెబ్బతో మంగళవారం ఎల్ఐసీ షేర్లు 8.66 శాతం పతనమై రూ.391.40 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఏకంగా 9.26 శాతం పడిపోయాయి. ఇది గడిచిన నాలుగు నెలల కాలంలోనే అత్యంత కనిష్ఠ స్థాయి కావడం గమనార్హం. 2022లో తొలిసారిగా వాటాలను విక్రయించింది. తాజాగా సోమవారం 2 శాతం వాటాను విక్రయించనున్నట్లు ప్రకటించగా.. అదనంగా మరో 4.5 శాతం వాటాను ఉపసంహరించుకునే (గ్రీన్‌షూ ఆప్షన్) అవకాశాన్ని కూడా కల్పించింది. ఒక్కో షేరు ధరను రూ. 382 చొప్పున భారీ డిస్కౌంట్‌తో నిర్ణయించారు. ప్రభుత్వం చేపట్టిన ఈ వాటా విక్రయం ద్వారా ఎల్ఐసీలో 10 శాతం వాటాలు ప్రయివేటు శక్తుల చేతుల్లోకి వెళ్లనున్నాయి.
ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పీఎస్‌యూల్లో రూ.80 వేల కోట్ల విలువ చేసే వాటాలను విక్రయించాలని మోడీ సర్కార్ బడ్జెట్‌లో లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే ఈ ఏడాది వివిధ పీఎస్‌యూ వాటా విక్రయాల ద్వారా ప్రభుత్వం సుమారు రూ.21,200 కోట్లను సమీకరించింది. ఎల్ఐసీ వాటా విక్రయం ద్వారా రూ. 31,400 కోట్లు కేంద్ర ఖజానాకు చేరే అవకాశం ఉంది.

# 100% 'స్వచ్ఛం' ప్రకటనపై అభ్యంతరాలు..స్పందించిన 'డాబర్'....




దేశీయ ప్రముఖ ఎఫ్ఎంసీజీ సంస్థ అయిన డాబర్ ఇండియాకు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మార్కెట్లో విక్రయిస్తున్న తమ వస్తువులపై "100 శాతం స్వచ్ఛం", "100 శాతం సహజం", అలాగే "100 శాతం ఆర్గానిక్'' వంటి నినాదాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ రకమైన అస్పష్టమైన ప్రకటనలు వినియోగదారులను తప్పుదారి పట్టించే అవకాశం ఉందని ఎఫ్ఎస్ఎస్ఏఐ జారీ చేసిన ఉత్తర్వులలో పేర్కొంది.
డాబర్ సంస్థకు చెందిన హిమాలయన్ ఆర్గానిక్ యాపిల్ సైడర్ వెనిగర్, అలాగే ఆర్గానిక్ హనీ ఉత్పత్తుల ప్యాకింగ్‌పై ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండానే 'జైవిక్ భారత్' లోగోను ముద్రించినట్లు అథారిటీ గుర్తించింది. ఇది స్పష్టమైన నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుందని తేల్చింది. అంతేకాకుండా, డాబర్ హోమ్ మేడ్ కోకోనట్ మిల్క్ ప్యాకెట్లపై '100 శాతం స్వచ్ఛత' అనే పదాన్ని వాడటం కూడా చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. తక్షణమే ఈ ఉత్పత్తుల విక్రయాలను నిలిపివేసి, రెండు వారాల్లోగా (15 రోజులు) తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలని డాబర్‌ను ఆదేశించింది. ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశాలపై డాబర్ ఇండియా యాజమాన్యం స్పందించింది. తాము జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్, బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బాఇ)లకు అందించిన సమాచారంలో.. తమ ఉత్పత్తుల లేబుల్స్ అన్నీ ప్రస్తుత చట్ట నిబంధనలకు, పరిశ్రమ ప్రమాణాలకు అనుగుణంగానే ఉన్నాయని తెలిపింది. వినియోగదారులను తప్పుదారి పట్టించేలా ఎలాంటి ఉద్దేశపూర్వక క్లెయిమ్స్ చేయలేదని స్పష్టం చేసింది. నాణ్యతకు తాము కట్టుబడి ఉన్నామని, తదుపరి చట్టపరమైన చర్యల కోసం నిపుణుల సలహా తీసుకుంటున్నామని పేర్కొంది. ఈ పరిణామాల ప్రభావంతో మంగళవారం స్టాక్ మార్కెట్లో డాబర్ షేరు దాదాపు 4.32 శాతం నష్టపోయి రూ.407.40 వద్ద ముగిసింది.

# ఈ వాటర్ ఆరోగ్యానికి అమృతం!



భారతీయ వంటగదిలో మెంతులకు ప్రత్యేక స్థానం ఉంది. అయితే వీటిని ఒక పద్ధతి ప్రకారం తీసుకుంటే అది ఖరీదైన మందుల కంటే బాగా పనిచేస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా మధుమేహం ఉన్నవారిలో రక్తంలోని చక్కెర స్థాయిలను నియంత్రించడానికి ఇది అద్భుతంగా పనిచేస్తుందని అంటున్నారు. మన వంటింట్లో సులభంగా దొరికే మెంతులలో అద్భుతమైన ఆరోగ్య రహస్యాలు దాగి ఉన్నాయి.


మెంతులు కేవలం పోపు దినుసులే కాకుండా, ఆయుర్వేదంలో గొప్ప ఔషధంగా పరిగణించబడతాయి. మెంతులను నేరుగా తీసుకోవడం కంటే, నానబెట్టి తీసుకోవడం వల్ల వాటిలోని పోషకాలు శరీరానికి మరింత సమర్థవంతంగా అందుతాయని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. మెంతులలో ఉండే గెలాక్టోమన్నన్ అనే మూలకం రక్తంలో చక్కెర శోషణను తగ్గిస్తుంది. ఇది ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచి మధుమేహ వ్యాధిగ్రస్తులకు మేలు చేస్తుంది. మెంతులలో పీచు పదార్థం అధికంగా ఉంటుంది. నానబెట్టిన మెంతులు తీసుకోవడం వల్ల మలబద్ధకం, ఎసిడిటీ వంటి సమస్యలు తగ్గి జీర్ణక్రియ సాఫీగా సాగుతుంది. ఉదయాన్నే మెంతులు తీసుకోవడం వల్ల కడుపు నిండినట్లు అనిపిస్తుంది. దీనివల్ల అతిగా తినడం తగ్గి, బరువు తగ్గడానికి దోహదపడుతుంది. మెంతులలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ముఖంపై ముడతలను తగ్గిస్తాయి. జుట్టు రాలడం తగ్గి, కుదుళ్లు బలంగా మారడానికి ఇవి సహాయపడతాయి. శరీరంలోని ఎల్‌డీఎల్ లేదా చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో మెంతులు కీలక పాత్ర పోషిస్తాయి, తద్వారా గుండె జబ్బుల ముప్పు తగ్గుతుంది. ఎలా తీసుకోవాలి?: ఒక స్పూన్ మెంతులను రాత్రిపూట ఒక గ్లాసు నీటిలో నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయం పరగడుపున ఆ నీటిని తాగి, నానబెట్టిన మెంతులను నమిలి తినాలి. మెంతులు ఆరోగ్యానికి ఎంతో మేలు చేసినప్పటికీ, గర్భిణీ స్త్రీలు లేదా ఏదైనా దీర్ఘకాలిక వ్యాధుల కోసం మందులు వాడుతున్న వారు వైద్యుని సలహా మేరకు మాత్రమే వీటిని తీసుకోవడం మంచిది. సహజమైన పద్ధతిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి మెంతులు ఒక చౌకైన, శక్తివంతమైన మార్గం.

# జామ అకులతో డయాబెటీస్‌కు చెక్!



పంటి నొప్పి, చిగుళ్ల వాపు, నోటి దుర్వాసన.. ఈ సమస్యలకు ఖరీదైన మౌత్ వాష్‌లే పరిష్కారం అనుకుంటున్నారా..? అయితే మీరు పొరబడినట్లే.. మన పెరట్లోనే దొరికే జామ ఆకులతో వీటన్నింటికీ చెక్ పెట్టవచ్చు. కేవలం నోటి ఆరోగ్యమే కాదు, డయాబెటిస్ నుంచి చర్మ సౌందర్యం వరకు జామ ఆకులు చేసే మేలు అంతా ఇంతా కాదు. మన పెరట్లో కనిపించే జామ చెట్టు కేవలం రుచికరమైన పండ్లనే కాదు, అమూల్యమైన ఔషధ గుణాలున్న ఆకులను కూడా అందిస్తుంది. ఖరీదైన మందులు, మౌత్ వాష్‌లకు బదులుగా రోజుకు రెండు జామ ఆకులను నమలడం వల్ల నోటి ఆరోగ్యం నుండి డయాబెటిస్ నియంత్రణ వరకు ఎన్నో లాభాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. నోటి దుర్వాసన, చిగుళ్ల వాపు, పంటి నొప్పితో బాధపడేవారికి జామ ఆకులు ఒక వరం. వీటిలోని యాంటీ బాక్టీరియల్ గుణాలు నోటిలోని బ్యాక్టీరియాను చంపేస్తాయి. చిగుళ్ల నుండి రక్తం కారడం, వాపు ఉన్నప్పుడు లేత జామ ఆకులను నమలడం వల్ల తక్షణ ఉపశమనం లభిస్తుంది. జామ ఆకులను నమలడం వల్ల వచ్చే రసం మీ జీర్ణవ్యవస్థను శుద్ధి చేస్తుంది. ఇది గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలను తగ్గించడమే కాకుండా, శరీరంలోని హానికరమైన వ్యర్థాలను బయటకు పంపుతుంది. శాస్త్రీయ పరిశోధనల ప్రకారం.. జామ ఆకుల సారం రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరగకుండా నిరోధిస్తుంది. ముఖ్యంగా భోజనం తర్వాత గ్లూకోజ్ స్థాయిలను అదుపులో ఉంచడానికి ఇది సహాయపడుతుంది. కొవ్వు నిరోధకం: కార్బోహైడ్రేట్లు చక్కెరగా మారి శరీరంలో కొవ్వుగా పేరుకుపోకుండా జామ ఆకులు అడ్డుకుంటాయి. ఇది బరువు తగ్గాలనుకునే వారికి గొప్ప చిట్కా. వీటిలోని విటమిన్-సి, యాంటీఆక్సిడెంట్లు చర్మంపై ముడతలను తగ్గించి, సహజమైన మెరుపును అందిస్తాయి. రోజుకు 2 నుండి 3 లేత జామ ఆకులను శుభ్రంగా కడిగి నమలడం సరిపోతుంది. అయితే గర్భిణీ స్త్రీలు లేదా ఇతర తీవ్రమైన అనారోగ్య సమస్యలకు మందులు వాడుతున్న వారు, వీటిని వాడే ముందు ఖచ్చితంగా వైద్యుడిని సంప్రదించాలి. అతి తక్కువ ఖర్చుతో, సహజసిద్ధంగా మీ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి రోజువారీ అలవాట్లలో జామ ఆకులను చేర్చుకోవడం ఒక ఉత్తమ మార్గం.

# అరటిపండు, నారింజ: ఏది తింటే ఆరోగ్యానికి మంచిది..?



చాలామంది ఉదయం నిద్రలేవగానే తక్షణ శక్తి కోసం ఏదో ఒక పండు తింటుంటారు. అయితే అల్పాహారంలో అరటిపండు తీసుకోవాలా లేక నారింజ పండు తీసుకోవాలా అనే సందేహం చాలామందిలో ఉంటుంది. ఈ రెండు పండ్లు ఆరోగ్యానికి మేలు చేసినప్పటికీ, వీటిని ఎప్పుడు, ఎలా తినాలో తెలిస్తేనే పూర్తి ప్రయోజనాలు అందుతాయి. తక్షణ శక్తికి అరటిపండు: అరటిపండులో కార్బోహైడ్రేట్లు, సహజ చక్కెరలు పుష్కలంగా ఉంటాయి.

ఇవి శరీరానికి తక్షణమే గ్లూకోజ్‌ను అందించి, రోజంతా ఉత్సాహంగా ఉండటానికి సహాయపడతాయి. ఇందులో ఉండే పొటాషియం రక్తపోటును నియంత్రించడంలో, గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. జీర్ణక్రియ: అరటిపండులోని ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఖాళీ కడుపుతో కేవలం అరటిపండును మాత్రమే తింటే కొంతమందిలో కడుపు ఉబ్బరం రావచ్చు. అందుకే వీటిని నట్స్ లేదా ఇతర ఆహారాలతో కలిపి తీసుకోవడం ఉత్తమం.

# బ్లాక్ కాఫీతో కేలరీలు మంచులా కరిగిపోవాలా?






నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యత పెరిగింది. బరువు తగ్గడం కోసం డైట్ చేసేవారు, జిమ్‌కు వెళ్లేవారు ఎక్కువగా 'గ్రీన్ టీ' లేదా 'బ్లాక్ కాఫీ'ని ఆశ్రయిస్తుంటారు.

ఈ రెండూ కూడా తక్కువ కేలరీలు కలిగి ఉండి, శరీరంలోని జీవక్రియలను వేగవంతం చేస్తాయి. గ్రీన్ టీలోని యాంటీఆక్సిడెంట్లు ఆరోగ్యానికి రక్షణగా నిలిస్తే, బ్లాక్ కాఫీలోని కెఫీన్ తక్షణ శక్తిని అందిస్తుంది. ఒకటి పొట్ట చుట్టూ ఉన్న కొవ్వును నిదానంగా కరిగిస్తే, మరొకటి వ్యాయామం చేసే సమయంలో మీ శారీరక సామర్థ్యాన్ని పెంచుతుంది. ముఖ్య పదార్థం: ఇందులో ఇఉఅఉ అనే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్ ఉంటుంది. ఇది వ్యాయామం చేసేటప్పుడు కొవ్వు కణాలను విచ్ఛిన్నం చేయడానికి సహాయపడుతుంది. కెఫీన్: ఇందులో కెఫీన్ తక్కువగా ఉండటం వల్ల గుండెపై ఒత్తిడి పడదు. ఎసిడిటీ సమస్య ఉన్నవారికి ఇది ఉత్తమ ఎంపిక. ప్రయోజనం: ఇది నిదానంగా కానీ, దీర్ఘకాలికంగా బరువు తగ్గడానికి మరియు రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచడానికి తోడ్పడుతుంది.

2. బ్లాక్ కాఫీ: ముఖ్య పదార్థం: ఇందులో కెఫీన్ అధికంగా ఉంటుంది. ఇది కేంద్ర నాడీ వ్యవస్థను ప్రేరేపించి, మెటబాలిజంను 3-11% వరకు వేగవంతం చేస్తుంది. శక్తి ప్రదాత:

వ్యాయామానికి ముందు బ్లాక్ కాఫీ తాగడం వల్ల శక్తి స్థాయిలు పెరిగి, ఎక్కువ సేపు వర్కౌట్ చేసే సామర్థ్యం వస్తుంది.

# అది చూడనందుకు బాధపడుతున్నా..



స్టార్ నటుడు సత్యరాజ్ 'బాహుబలి' చిత్రంలో 'కట్టప్ప'గా ఐకానిక్ పాత్రలో నటించి దేశవ్యాప్తంగా అపారమైన గుర్తింపు అందుకున్నారు. ప్రస్తుతం ఆయన వైవిధ్యమైన సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా వరుస చిత్రాలు చేస్తూ సినీ ప్రేక్షకులను విశేషంగా అలరిస్తున్నారు. త్వరలోనే ఆయన 'జిడి నాయుడు' బయోపిక్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. భారతదేశపు గొప్ప ఆవిష్కర్త, ఇండియన్ ఎడిసన్‌గా చరిత్రలో నిలిచిపోయిన జి.డి. నాయుడు జీవిత చరిత్ర ఆధారంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ బయోపిక్ చిత్రం 'జిడిఎన్'. ఈ సినిమాలో జి.డి. నాయుడు ప్రధాన పాత్రలో వర్సటైల్ యాక్టర్ ఆర్. మాధవన్ నటిస్తుండగా, దుషారా విజయన్ హీరోయిన్‌గా అలరించనున్నారు. అలాగే సత్యరాజ్, జయరామ్, ప్రియమణి, బ్రిగిడా సగా కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. ప్రతిభావంతుడైన దర్శకుడు కృష్ణకుమార్ రామకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ భారీ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఆగస్ట్ 7న గ్రాండ్‌గా థియేటర్లలోకి రాబోతోంది. సినిమా విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో మేకర్స్ ప్రమోషన్లలో భాగంగా తాజాగా గ్రాండ్‌గా ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నటుడు సత్యరాజ్ అత్యంత ఎమోషనల్ కామెంట్స్ చేశారు. తాను కోయంబత్తురులోనే పుట్టి పెరిగినప్పటికీ, ఇప్పటివరకు అక్కడ ఉన్న జిడి నాయుడు గారి మ్యూజియంను సందర్శించలేకపోయినందుకు మనసులో చాలా గిల్టీగా ఫీల్ అవుతున్నానని సత్యరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే సత్యరాజ్, జయరామ్, ప్రియమణి, బ్రిగిడా సగా కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. ప్రతిభావంతుడైన దర్శకుడు కృష్ణకుమార్ రామకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ భారీ చిత్రం ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలోకి రాబోతోంది. సినిమా విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో మేకర్స్ ప్రమోష న్లలో భాగంగా తాజాగా గ్రాండ్‌గా ప్రెస్ మీట్ నిర్వహించారు. అంతేకాకుండా జిడి నాయుడు గారు చేసిన అద్భుతమైన ఆవిష్కరణలను, థామస్ అల్వా ఎడిసన్ గారి గొప్ప ఆవిష్కరణలతో సమానంగా ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఒక్కరూ గుర్తించి గౌరవించాలని, కీర్తించాలని కోరారు. అలాగే ఈ సినిమాలో నాయుడు గారి చివరి రోజులలో ఉండే రూపానికి సంబంధించి చేసిన అలంకరణ, మేకప్ మార్పులు తనను ఎంతగానో ఆశ్చర్యపరిచాయని సత్యరాజ్ ఈ ప్రెస్ మీట్‌లో వెల్లడించారు.

# దూకుడు కోసం శంకర్ సినిమా వదులుకున్నాడు...



సూపర్ స్టార్ మహేష్ బాబు కెరీర్‌లో బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన దూకుడు సినిమా గురించి దర్శకుడు శ్రీనువైట్ల ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, దూకుడు మూవీ రిలీజ్ సమయంలో దర్శకుడు శంకర్ రూపొందించిన ఓ సినిమాకు సంబంధించిన డ్రాఫ్ట్‌ను మహేష్ బాబుకు పంపించారని తెలిపారు. అయితే, ఆ కథను మహేష్ బాబు చదవలేదని చెప్పారు. దీనికి కారణం, అప్పటికే దూకుడు సినిమా పనుల్లో మహేష్ పూర్తిగా నిమగ్నమై ఉండటమేనని శ్రీనువైట్ల వివరించారు.

ఒకేసారి రెండు సినిమాలపై దృష్టి పెట్టకుండా, తాను చేస్తున్న ప్రాజెక్టుపైనే పూర్తి దృష్టి సారించాలనే ఉద్దేశంతో శంకర్ సినిమా స్క్రిప్ట్‌ను కూడా చదవలేదని పేర్కొన్నారు. అలాగే, దూకుడు' తనకు చాలా ఇంపార్టెంట్ సినిమా అని మహేష్ చెప్పారని శ్రీనువైట్ల వెల్లడించారు. ఆ సమయంలో మహేష్ వరుస విజయాల కోసం ఎదురుచూస్తుండటంతో, ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పూర్తి ఏకాగ్రతతో పనిచేశారని తెలిపారు. ఆ నిర్ణయమే చివరకు ఫలించి, మహేష్ కెరీర్‌లో గుర్తుండిపోయే భారీ విజయాల్లో ఒకటిగా నిలిచిందని శ్రీనువైట్ల వ్యాఖ్యానించారు. కాగా ఆగస్టు 9న ఈ సినిమా రీ రిలీజ్ కానుంది.

# గోపీచంద్ మలినేని మాస్ కౌంటర్....!

నందమూరి బాలకృష్ణ, డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో రాబోతున్న భారీ ప్రాజెక్ట్ 'ఔఃఐ-111'. 'వీరసింహారెడ్డి' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ గ్యాంగ్‌స్టర్‌గా నటిస్తున్న ఈ సినిమాలో ఇప్పటికే లేడీ సూపర్ స్టార్ నయనతార మెయిన్ హీరోయిన్‌గా ఖరారైన సంగతి తెలిసిందే.

తాజాగా, ఈ చిత్రంలో మరో యంగ్ బ్యూటీని ఎంపిక చేసుకున్నట్లు పలు పోస్టులు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. సెకండ్ పార్ట్ కోసం మరో హీరోయిన్ అవసరమని, ఆ పాత్ర కోసం డింపుల్ హయాతిని ఎంపిక చేసినట్లు టాక్. 'ఇంత హైప్ ఉన్న సినిమాను ఎలా చెడగొట్టాలో మేకర్స్‌ను చూసి నేర్చుకోవాలి.



# విడుదలకు సిద్ధమైన 'వన్స్ మోర్'




కోలీవుడ్ యంగ్ హీరో అర్జున్ దాస్ తన విలక్షణమైన నటనా శైలితో పాటు తన గంభీరమైన వాయిస్‌తో తెలుగు, తమిళ సినీ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నారు. ఇటీవల ఆయన ప్రధాన పాత్రలో నటించిన 'కాన్ సిటీ' చిత్రం థియేటర్లలోకి వచ్చి అలరించినప్పటికీ, ఆశించిన స్థాయిలో బాక్సాఫీస్ హిట్ అందుకోలేకపోయింది. అయినప్పటికీ ఆయన ఎంతమాత్రం నిరాశ చెందకుండా కేవలం నెలరోజుల వ్యవధిలోనే మరో ఆసక్తికరమైన సినిమాను లైన్లో పెట్టి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం అర్జున్ దాస్ ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'వన్స్ మోర్'. దర్శకుడు విఘ్నేష్ శ్రీకాంత్ ఎంతో ఆసక్తికరంగా తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో అర్జున్ దాస్ సరసన యంగ్ బ్యూటీ అదితి శంకర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ యూత్‌ఫుల్ రొమాంటిక్ డ్రామా చిత్రానికి ప్రముఖ మ్యూజిక్ దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తున్నారు. స్వచ్ఛమైన ప్రేమ, బలమైన మానవ భావోద్వేగాలు, ఆకట్టుకునే ఫ్యామిలీ ఎలిమెంట్స్ కలగలిసిన వైవిధ్యమైన కథతో తెరకెక్కిన ఈ చిత్రం యూత్‌తో పాటు ఫ్యామిలీ ఆడియన్స్‌ను కూడా తప్పకుండా మెప్పిస్తుందని మూవీ టీమ్ నమ్మకంగా చెబుతోంది.

# ఇకపై అలాంటి పాత్రలే చేస్తాను...



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కాజోల్ మూడు దశాబ్దాలకు పైగా సినీ పరిశ్రమలో ఎన్నో వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తున్న ఆమె ఇటీవల 'ది ట్రయల్' వెబ్ సిరీస్‌తో పాటు 'దో పత్తి', 'మా' వంటి లేడీ ఓరియెంటెడ్ చిత్రాలలో నటించారు. ప్రస్తుతం ఆమె చేతిలో ప్రాజెక్ట్స్ లేనప్పటికీ కథలు వింటూ తన కుటుంబంతో సమయాన్ని గడుపుతున్నారు. ఈనేపథ్యంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కాజోల్, హిందీ చిత్రసీమలో మహిళా పాత్రలకు సరైన ప్రాధాన్యత దక్కుతోందని తెలిపారు. మహిళా ప్రాధాన్య కథల విషయంలో మనం సరైన దిశలోనే ప్రయాణిస్తున్నామని అన్నారు. తన ఇన్నేళ్ల సినీ ప్రయాణంలో వెండితెరపై మహిళా పాత్రల చిత్రణ పూర్తిగా మారిపోయిందని కాజోల్ అభిప్రాయపడ్డారు. ఇప్పుడు రచయితలు మహిళల కోసం అత్యుత్తమ పాత్రలను రాస్తున్నారని తెలిపారు. కథలో కేవలం ఒక పక్క పాత్రగా మాత్రమే కాకుండా, వారికి పూర్తిస్థాయి ప్రాధాన్యత ఇస్తుండటం చాలా మంచి పరిణామం అని ఆమె వెల్లడించారు. ఇక కథల ఎంపిక గురించి మాట్లాడుతూ.. నటిగా ఎంతగా పరిణతి చెందినప్పటికీ కథలను ఎంచుకునే విషయంలో తన పద్ధతి మాత్రం ఎప్పుడూ మారలేదని కాజోల్ చెప్పారు. తనకు మనస్ఫూర్తిగా నచ్చిన, ఏదైనా కొత్తగా చేయడానికి అవకాశం ఉన్న పాత్రలనే తాను ఎప్పుడూ ఎంచుకుంటానని ఆమె తెలిపారు. అయితే ఇకపై మరింతగా ప్రయోగాలు చేయాలని, ఇప్పటివరకు చేయని వైవిధ్యమైన పాత్రలను ప్రయత్నించాలని అనుకుంటున్నట్లు స్పష్టం చేశారు. ఒక పాత్ర తనను మొదటి చూపులోనే ఒప్పించకపోతే తాను ఆ సినిమాను అస్సలు చేయనని ఆమె అన్నారు. అలాగే వ్యక్తిగతంగా, వృత్తిపరంగా కాలంతో పాటు తాను కూడా మారానని చెబుతూ, గతంతో పోలిస్తే తాను ప్రస్తుతం మరింత దయగల వ్యక్తిగా మారానని కాజోల్ పేర్కొన్నారు.

Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com